



నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన ప్రముఖ నాయకులు - లోకేశ్, నానీలతో మాజీ జడ్పీటీసీ సరిత,రమణమూర్తి దంపతులు

చంద్రగిరి వైసీపీకి దెబ్బ మీద దెబ్బ

- టీడీపీలోకి మాజీ జడ్పీటీసీ సరితా రమణమూర్తి, బడి సుధా యాదవ్, గణపతి నాయుడు
- లోకేష్ సమక్షంలో చేరిన పలువురు నేతలు
- టీడీపీలో అంతకంతకూ పెరుగుతున్న జోష్

ఇటీవలే చేరిన పలువురు ప్రముఖులు

కొద్ది నెలల కిందట తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్ వైసీపీ నుంచీ టీడీపీలే చేరగా ఇటీవలే ఆయనను చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడిగా పార్టీ నియమించింది. టికెట్ ఆశించిన డాలర్స్ దివాకర్ రెడ్డి సైతం కొద్ది రోజుల కిందట చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అదే విధంగా చంద్రగిరి మండలంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఈవీ రమణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, పాకాల జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఆమె భర్త నంగా బాబురెడ్డి, ఎంపీటీసీ కస్తూరి, మాజీ ఎంపీపీ లక్ష్మీకాంతమ్మ, మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వరి, మాజీ ఏఎంసీ చైర్మన్ లింగయ్యనాయుడు, చిన్నగొట్టిగల్లు వైస్ ఎంపీపీ సునీత, ఆమె భర్త దామోదర్, ఆర్సీపురంలో నీలకంఠ చౌదరి తదిరులు వైసీపీని వీడి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. నియోజకవర్గంలో ఇలాంటి అంగబలం, అర్థబలం కలిగిన నాయకులు చేరుతుండడంతో టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యం ఇనుమడిస్తోంది. అదే సమయంలో అధికార పార్టీ వర్గాలు వరుస వలసలతో డీలా పడుతున్నాయి.

తిరుపతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. ముఖ్యనేతలు తమను ఎదగనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఐదేళ్ళ నుంచీ తీవ్ర అసంతృప్తిని అణచిపెట్టుకుని వున్న పలువురు గ్రామ, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎన్నికల వేళ ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారు. తాజాగా ఆదివారం రాష్ట్ర ఓబీసీ ఫోరమ్ కన్వీనర్, తిరుపతి రూరల్ మండల పరిధిలోని పుదిపట్ల సర్పంచ్ బడి సుధా యాదవ్, పద్మావతీపురం మాజీ సర్పంచ్ గణపతి నాయుడు, అతడి భార్య తిరుచానూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్‌పర్సన్ శ్రీవిద్య, చంద్రగిరి మాజీ జడ్పీటీసీ సరితా రమణమూర్తిలతో పాటు పలువురు గ్రామ, మండల నాయకులు ఉండవల్లిలో నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ వారిని యువనేతకు పరిచయం చేశారు. అందరికీ పార్టీ కండువాలు కప్పిన లోకేశ్ చంద్రగిరిలో టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీపై నమ్మకముంచి చేరిన వారికి మంచి భవిష్యత్తు వుంటుందని భరోసా ఇచ్చారు. యువనేత సమక్షంలో పార్టీలో చేరిన వారిలో వైసీపీ సీనియర్ నాయకుడు రమణ, పుదిపట్ల ఎంపీటీసీ శ్రీకాంత్, సాయినగర్ ఎంపీటీసీ వినోద్, మల్లంగుంట మాజీ సర్పంచ్ దిలీప్, పుదిపట్ల ఉప సర్పంచ్ మునిరత్నం నాయుడు, శ్రీనివాసపురం ఉప సర్పంచ్ సునీల్, విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి తదితరులున్నారు.

ముఖ్య నేతల చేరికతో వైసీపీకి కోలుకోలేని దెబ్బ

చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కడికక్కడ సొంత బలం కలిగిన సుధా యాదవ్, గణపతి నాయుడు, మునికృష్ణారెడ్డి తదితరులు టీడీపీలో చేరడంతో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. వీరిలో మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి అనుచరుడైన సుధా యాదవ్ గత ఎన్నికల తర్వాత వైసీపీలో చేరినప్పటికీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనను ఎదగనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ ఎదురు తిరిగారు. తిరుపతి రూరల్ పుదిపట్ల పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసిన అతడిని వైసీపీ నేతల ఒత్తిళ్ళతో పోలీసు అధికారులు వ ు ప్పు తి ప్పలు పెట్టారు. పలు కేసులు పెట్టారు. చెవిరెడ్డి కుటుంబం యావత్తూ పుదిపట్లలోనే మకాం వేసింది. అయినా 500 పైచిలుకు ఓట్ల మెజారిటీతో సుధా యాదవ్ సర్పంచుగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచీ ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఓ దశలో గల్లా కుటుంబం మద్దతుతో చంద్రగిరి టీడీపీ టికెట్ కోసం గట్టిగా ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే పులివర్తి నానీ నియోజకవర్గంలో పాతుకుపోవడం, పార్టీ శ్రేణుల్లో పట్టు పెంచుకోవడం, దానికి తోడు అదివరకే నారా లోకేశ్ ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించేసి వుండడంతో సుధా యాదవ్ ప్రయత్నాలు ఫలించలేదు. పులివర్తి నానీ చొరవ తీసుకుని సుధా యాదవ్‌ను అటు అధినేత చంద్రబాబుతోనూ, ఇటు యువనేత నారా లోకేశ్‌తోనూ కలిపి మాట్లాడించారు. పార్టీలో చేరి విజయానికి కృషి చేయాలని, భవిష్యత్తులో తప్పక ప్రాధాన్యత ఇస్తామని వారిద్దరూ హామీ ఇవ్వడంతో ఆదివారం ఆయన టీడీపీలో చేరిపోయారు. పద్మావతీపురం మాజీ సర్పంచ్ గణపతి నాయుడుకు స్థానికంగా ప్రజాబలముంది. ఆయన చేరిక కూడా నిస్సందేహంగా తిరుపతి రూరల్ తిరుచానూరు, పరిసర ప్రాంతాల్లో టీడీపీని బలోపేతం చేసింది.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో చంద్రబాబు

తిరుపతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సూచించారు. ఉండవల్లిలో ఆదివారం తన నివాసంలో వారికి బీ ఫారాలను చంద్రబాబు అందజేశారు.చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు,తిరుపతి,చిత్తూరు జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు బీ ఫారాలు అందుకున్నారు. అనంతరం చంద్రబాబు అభ్యర్థుల చేత ప్రమాణం చేయించారు. ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని సూచించారు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్ అప్రజాస్వామిక పాలనను ప్రజలకు వివరించా లన్నారు. విజయంతో తిరిగిరావాలని ఆశీర్వదించారు.



చంద్రబాబు చేతుల మీదుగా బీ ఫామ్‌లు అందుకున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

కలెక్టర్ తనిఖీలు

సత్యవేడు, ఏప్రిల్ 21: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం సత్యవేడు మండలంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. తొలుత దాసుకుప్పం పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్ పోస్టుల్లో ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం రవాణా కాకుండా నిఘా వుంచాలని సూచించారు.దాసుకుప్పంలోని ఆదర్శ పాఠశాలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమును, పోలింగ్ సిబ్బందికి ఇచ్చే ఎన్నికల సామగ్రిని, కంపార్ట్‌మెంట్ యూనిట్ తదితరాలను పరిశీలించారు. ఈవీఎం సెకండ్ ర్యాండమైజేషన్‌ను సెక్టార్ వారీ ఏర్పాటుతో, బందోబస్తు నడుమ చేపట్టాలని సూచించారు. పక్కనే ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌ను తనిఖీ చేశారు.ఎన్నికల అధికారి నరసింహులు, తహసీల్దారు, సెక్టోరల్ అధికారులు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



సామాజికంగా అట్టడుగు వర్గమైన దళిత కుటుంబం నుంచీ వచ్చారాయన. ప్రధానోపాధ్యాయుడి కొడుకుగా చదువుకు ప్రాముఖ్యత ఇచ్చారు.ఉన్నత విద్యావంతుడిగా ఎదిగారు. మూడు పర్యాయాలు సివిల్స్ రాసి వరుసగా ఐఆర్ఎస్, ఐపీఎస్, ఐఏఎస్ సాధించారు. వీటిలో ఐఏఎస్‌ను ఎంచుకుని తమిళనాడు కేడర్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయికి చేరుకున్నారు. నాటి సీఎం జయలలిత స్ఫూర్తితో ప్రజాసేవ వైపు దృష్టి సారించి రాజకీయాల్లో అడుగుపెట్టారు. ప్రజారాజ్యం తర్వాత వైసీపీలో చేరి తొలుత తిరుపతి ఎంపీగా, ఆపై గూడూరు ఎమ్మెల్యేగా గెలిచారు. దళితులను గౌరవించడం లేదంటూ ఆ పార్టీని, మనస్సాక్షి లేని వ్యక్తంటూ అధినేత జగన్‌నూ వద్దనుకున్నారు. మరో చోట ఎమ్మెల్యే టికెట్ ఇస్తామన్నా తృణప్రాయంగా తిరస్కరించి క్రమశిక్షణ కలిగిన పార్టీగా పేరున్న బీజేపీలో చేరారు. తాజా ఎన్నికల్లో ఎన్డీయే తరపున తిరుపతి ఎంపీగా పోటీ చేస్తున్న ఆయనే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్. వైసీపీతో పదేళ్ళ ప్రస్థానంలో ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలు, ఏ పరిస్థితుల్లో పార్టీని వీడాల్సివచ్చిందన్న అంశాలపై తన మనసులోని మాటలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారాయన.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జగన్ అవమానించడంతో వైసీపీని వీడా!

- వైసీపీలో దళితులను ఎదగనివ్వరు
- కేంద్రంలో,రాష్ట్రంలో రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమే
- అవకాశమిస్తే తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతా
- తిరుపతి ఎన్డీయే ఎంపీ అభ్యర్థి వరప్రసాద్



నాన్న నేర్పిన క్రమశిక్షణతోనే ఈ స్థితికి ఎదిగా!

మాది కృష్ణా జిల్లా కొమ్మలమూడి గ్రామం. నాన్న చిరంజీవులు గుడివాడ సమీపంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు. అమ్మ మిరియమ్మ గృహిణి. నాన్న వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కావడంతో విలువలతో బతకడం నేర్పారు. ఆయన నేర్పిన క్రమశిక్షణతోనే చిన్నప్పటి నుంచీ కష్టపడి చదివా. చదువులో రాణించా. మచిలీపట్నం నోబుల్ హైస్కూలులో టెన్త్, అక్కడే అదే కాలేజీలో ఇంటర్ పూర్తి చేశా. ఆంధ్రా వర్శిటీలో ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ అయ్యాక అక్కడే పీహెచ్‌డీ పూర్తి చేశా.

బయో కెమిస్ట్ నుంచీ ఐఏఎస్ దాకా సుదీర్ఘ ప్రస్థానం

చదువు పూర్తయ్యాక బయో కెమిస్ట్ నుంచీ ఐఏఎస్ సాధించే దాకా ఉద్యోగ రంగంలో నాది సుదీర్ఘ ప్రస్థానం. పీహెచ్‌డీ అయ్యాక పుదుచ్చేరి ప్రభుత్వాస్పత్రిలో బయో కెమిస్ట్‌గా తొలి ఉద్యోగం వచ్చింది. తర్వాత జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో అధికారిగా చేశా. ఆపై నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీలో రెండేళ్ళు అధికారిగా కొనసాగా. ఆ సమయంలో ఎస్బీఐలో కూడా ఉద్యోగమొచ్చినా చేరలేదు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గ్రేడ్ బీ అధికారిగా రెండేళ్ళు విధులు నిర్వర్తించా.

సివిల్స్‌లో మూడు సార్లూ ఎంపికయ్యా!

ఇన్సూరెన్సు,బ్యాంకింగ్ ఉద్యోగాలతో సంతృప్తి చెందలేకపోయా. పదిమందికీ ఉపయోగపడే ఉద్యోగం చేయాలని ఆలోచించి సివిల్స్ రాయాలని నిర్ణయించుకున్నా. 1981లో తొలిసారి సివిల్స్ రాస్తే ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యా. ఆదాయపన్ను శాఖలో ఉద్యోగం వచ్చింది. 1982లో రెండో సారి రాస్తే ఐపీఎస్ వచ్చింది. కానీ చేరలేదు. మూడవసారి 1983లో సివిల్స్ రాసి ఐఏఎస్‌కు ఎంపికయ్యా. తమిళనాడు కేడర్ ఎంచుకున్నా. అక్కడ సబ్ కలెక్టర్ మొదలుకుని కలెక్టర్, పలు శాఖల కమిషనర్‌గా, పలు కార్పొరేషన్లకు ఎండీగా, ఛైర్మన్‌గా, చివరికి ప్రిన్సిపల్ కార్యదర్శి స్థాయి దాకా వివిధ హోదాల్లో పనిచేశా.

నిజాయితీగా పార్టీలో కొనసాగితే... కుట్రతో గూడూరు పంపించారు!

గత టీడీపీ ప్రభుత్వంలో 23మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు వైసీపీని వదిలిపెట్టి టీడీపీలో చేరారు. నేను మాత్రం జగన్‌ను, పార్టీని గౌరవించి క్రమశిక్షణతో పార్టీలోనే కొనసాగా. ప్రత్యేక హోదా కోసం పదవికి రాజీనామా చేయాలని ఆదేశిస్తే శిరసావహించా. ఎంతో నిజాయితీగా పనిచేసిన నాకు 2019 ఎన్నికల్లో తిరిగి ఎంపీ టికెట్ ఇస్తారని భావించా. కానీ సజ్జల రామకృష్ణారెడ్డిని కలవమని చెప్పారు. అప్పటికి ఆయన జగన్‌కు సన్నిహితుడు తప్ప సలహాదారు కాదు. వెళ్ళి కలిస్తే మీ పార్లమెంటు పరిధిలో మీకు ఎమ్మెల్యేలు సహకరించడం లేదని, కాబట్టి గూడూరులో పోటీ చేయాలని చెప్పారు. గూడూరులోనూ ఎమ్మెల్యేగా గెలిచా. కేవలం కుట్రతో, అసూయతో నా ఎదుగుదలను ఓర్వలేకనే రెండవ సారి ఎంపీగా పోటీ చేయనివ్వలేదు.

జయలలిత స్ఫూర్తితో ప్రజాసేవ వైపు దృష్టి

తమిళనాడులో బ్యూరోక్రాట్‌గా పనిచేసే సమయంలో సీఎంగా జయలలితను చాలా దగ్గరనుంచీ పరిశీలించి చూసే అవకాశం లభించింది. ప్రజలకు సేవ చేయాలనే ఆమె ఆలోచనలు, సంక్షేమ కార్యక్రమాల అమలు పట్ల ఆమ చర్యలు నన్ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. రాజకీయాల్లో చేరి ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన రావడంతో 1996లోనే ఉద్యోగానికి రాజీనామా చేయాలని భావించా. కానీ పిల్లల చదువులు పూర్తి కాకపోవడంతో జీవిత భాగస్వామి లక్ష్మి సలహా మేరకు ఉద్యోగంలో కొనసాగాల్సి వచ్చింది. తర్వాత 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి తిరుపతి ఎంపీగా పోటీ చేశా. ఆ ఎన్నికల్లో ఓటమి చెందినా ప్రజల్లోనే వుంటూ అన్ని వర్గాలతో కలసి రాజకీయాలు నేర్చుకున్నా.

జగన్‌పై జాలిపడి వైసీపీలో చేరా!

2012లో జగన్ జైల్లో వున్న సమయమది. ఆయన ఆహ్వానం మేరకు వెళ్ళి కలిశా. అప్పటికి అతడికి తండ్రి లేరు. అన్నదమ్ములూ లేరు. పార్టీ అధికారంలో లేకపోగా దానికి భవిష్యత్తు వుందో లేదో కూడా తెలియదు. అతని పరిస్థితి చూస్తే జాలి వేసింది. అందుకే ఆహ్వానించగానే పార్టీలో చేరా. 2014 ఎన్నికల్లో ఎన్నో షరతులు పెట్టినా అంగీకరించా.పార్టీకి సానుకూల పవనాలు లేవు. ఆదాయం అసలే లేదు. అందుకని ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎన్నికల్లో సాయం చేశా. పార్టీకి కూడా సాయపడ్డా. తక్కువ మెజారిటీతో ఆ ఎన్నికల్లో గెలిచా.

వైసీపీలో దళితులను గౌరవించరు

వైసీపీలో దళితులను గౌరవించరు. వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎదగనివ్వరు.రాష్ట్రంలో 29 మంది ఎస్సీ ఎమ్మెల్యేలుంటే వారిలో 27మందిని మార్చారు. తద్వారా దళిత నాయకత్వాన్ని అవమానించారు. రాజకీయాల్లో నాయకులను తయారు చేయాలే తప్ప బానిసలను కాదు.

మనస్సాక్షి లేని వ్యక్తి సీఎం జగన్!

సీఎం జగన్‌కు మనస్సాక్షి లేదు. మనిషికి విలువ ఇవ్వని వ్యక్తి అతడు. 2019లో అధికారంలోకి వచ్చాక కమ్మ సామాజికవర్గాన్ని దూరం చేసుకోవద్దని చెప్పా. వినిపించుకోలేదు.తోడబుట్టిన సోదరి షర్మిలను ఆదరించమని సలహా ఇచ్చా. పట్టించుకోలేదు. మద్యపాన నిషేధం అనేది నాకు అత్యంత ఇష్టమైన అంశం. ఎస్సీ, ఎస్టీ వంటి అట్టడుగు వర్గాల పేదలను అన్ని విధాలా నిర్వీర్యం చేస్తున్నది మద్యపానమే. నిషేధిస్తానని జగన్ మేనిఫెస్టోలో చెప్పారు. అమలు చేయాలని బతిమాలినా లెక్క చేయలేదు.

ఇసుక తవ్వకాలు ఆపమంటే గెటౌట్ అన్నారు!

జగన్‌తోనే కాదు అతడి చుట్టూ వుండే కోటరీతోనూ అనేక అవమానాలు ఎదుర్కొన్నా. స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు అక్రమంగా పెద్దఎత్తున జరుగుతున్నాయని, దాన్ని ఆపించాలని అడిగినందుకు విజయసాయిరెడ్డి గెటౌట్ అన్నారు. చిల్లకూరు మండలం బల్లవోలు గ్రామంలో అక్రమ మైనింగ్ జరుగుతుంటే వైసీపీ నాయకుడు అమరనాథరెడ్డి అడ్డుపడ్డాడని అతన్ని అరెస్టు చేయించి జైల్లో పెట్టారు. నేను వెళ్ళి అతడిని విడిపించినందుకు ఎందుకు విడిపించారు, మీరెందుకు అక్కడికి వెళ్ళారని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

అవమానించిన జగన్ ముఖం చూడకూడదనుకున్నా!

గత ఎన్నికల్లో తిరుపతి ఎంపీగా వున్న నన్ను గూడూరు అసెంబ్లీకి పోటీ చేయమన్నారు. ఈ ఎన్నికల్లో గూడూరు కూడా వద్దని సత్యవేడు వెళ్ళమని చెప్పారు. మీరు నా మనసులో వున్నారు... వెళ్ళి సత్యవేడులో నామినేషన్ వేయండి... అంటూ తీయటి మాటలు చెప్పారు. దానికోసం మళ్ళీ సలహాదారులను కలమన్నారు. నాకంటే చిన్నవాళ్ళను, అనుభవం లేని వాళ్ళను వెళ్ళి కలవమని చెప్పడం నన్ను బాధించింది. ఎవరో నా భవిష్యత్తును డిసైడ్ చేయడం ఏమిటి అని ఆలోచించి వద్దనుకున్నాను. నన్ను అవమానించిన జగన్ ముఖం ఇక చూడకూడదని నిర్ణయించుకున్నా.

సంక్షేమ పథకాలన్నీ జగన్నాటకమే!

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ జగన్నాటకమే. ఉదాహరణకు హౌసింగ్ స్కీమ్ తీసుకుంటే నిధులన్నీ కేంద్రానివి. పలు కార్యక్రమాలు ఉపాధి హామీ నిధులతో నడుస్తున్నాయి. అవీ కేంద్రం నుంచీ వస్తున్నవే. కులాల వారీ కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. కానీ వాటికి నిధుల్లేవు. కనీసం వాహనాలు కూడా లేవు. కానీ జగన్ సలహాదారులకు మాత్రం ఐఏఎస్‌లకు మించి లక్షలకు లక్షలు జీతాలు చెల్లిస్తున్నారు. ఆశ్చర్యకర విషయమేమిటంటే ఆ సలహాదారులెవరూ పార్టీకి గానీ, ఎన్నికల్లో పార్టీ గెలుపుతో గానీ సంబంధం వున్నవారు కాదు.

రైతు సొసైటీ పెట్టి సిలికా విక్రయించాలన్నా పట్టించుకోలేదు!

గూడూరులో సిలికా పెద్దఎత్తున లభిస్తుంది. అక్కడ ఒక్కరే సిలికా తవ్వుకుని అమ్ముకుంటున్నారు. విస్తృతంగా ప్రభుత్వ భూముల్లో వున్న సిలికాను ఒక్కరే ఎలా తవ్వుకుంటారని ప్రశ్నిస్తే ఎవరూ వినిపించుకోలేదు. రైతులతో సొసైటీ ఏర్పాటు చేసి దాని ద్వారా సిలికా అమ్మించాలని, ఆదాయం నేరుగా పేద రైతులకు అందేలా చూడాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదు.

క్రమశిక్షణ కలిగిన పార్టీ అనే బీజేపీలో చేరా!

బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ. ప్రధాని మోదీపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. ఆయన పాలన బాగుంది. తిరుపతి ఎంపీగా వున్నప్పుడు కూడా ఎలాంటి అపాయింట్‌మెంట్ లేకుండానే ఆరు సార్లు కలిశా. దేశాన్ని కాపాడాలనేదే ఆయన లక్ష్యం.ఇటీవల పార్టీకి నా బయోడేటా పంపగానే అధ్యక్షుడు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. వెళ్ళి కలసి తిరుపతి నుంచీ ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించాలని అభ్యర్థించా. అడిగిన వెంటనే తిరుపతి ఎంపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించారు. కేంద్రంలోనూ,రాష్ట్రంలోనూ రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమే.ప్రజలు ఆశీర్వదిస్తే రెండు ప్రభుత్వాల సంపూర్ణ సహకారంతో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతా!

కుటుంబం గురించి...

మాది కులాంతర వివాహం.లక్ష్మిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నా. ఇద్దరు పిల్లలు.కొడుకు నవీన్ గుప్తా. ఐఐఎం అహ్మదాబాద్ నుంచీ ఎంబీఏ చేశారు. ప్రస్తుతం మా కుటుంబ విద్యా సంస్థల బాధ్యత తీసుకున్నారు. ఇక కుమార్తె స్ఫూర్తి డాక్టర్. కొంతకాలం అమెరికాలో వుండి ఇక్కడ సేవలందించాలని వచ్చేశారు. ఇపుడు మా కుటుంబానికి చెందిన ఆస్పత్రి బాధ్యతలు చూస్తున్నారు. సమాజంలో విద్య, ఆరోగ్యం అందరికీ అవసరం. అందుకే వ్యాపారంలో కూడా ఈ రెండు రంగాలనే ఎంచుకుని విద్యా సంస్థ, వైద్య సంస్థ నిర్వహిస్తున్నా.

తలారిపల్లెలో రచ్చకెక్కిన వర్గపోరు

- ఇరువర్గాలపై కేసు నమోదు

పాకాల, ఏప్రిల్ 21: మండలంలోని ఇరంగారిపల్లె పంచాయతీ తలారిపల్లెలో వర్గపోరు రచ్చకెక్కింది. శనివారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. గ్రామంలో ఓ వర్గానికి చెందిన నాగేంద్ర, జయదేవ్ తదితరులు గ్రామంలోని మహిళలను కించపరుస్తూ ఏడాది క్రితం సోషియల్ మీడియాలో మెసేజ్‌లు పెట్టారని అప్పట్లో గ్రామస్థులు వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో తరచూ గ్రామంలో చిచ్చు రాజుకుంటోంది. శనివారం రాత్రి గ్రామంలో మళ్లీ ఘర్షణ చోటుచేసుకుంది. మహిళలను దుర్భాషలాడుతూ తప్పుడు మెసేజ్‌లు పెడుతూ, చంపేస్తామని బెదిరిస్తూ బీరుబాటిళ్లతో గ్రామంలో వీరవిహారం చేస్తున్న వీరికి సమీప గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సపోర్ట్ చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. శనివారం రాత్రి ఘటనపై నాగేంద్ర, భాను వారి అనుచరులు, మరో వర్గానికి చెందిన సద్దాం అనుచరులపై కేసులు నమోదు అయ్యాయి.

వైభవంగా అష్టోత్తర శత చండీ హోమం



రామచంద్రాపురం, ఏప్రిల్ 21: రాయలచెరువుకట్ట శక్తిపీఠంలో అష్టోత్తర శత చండీ హోమం ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా 108 యజ్ఞశాలలను ఏర్పాటు చేసి ఆదివారం 44 చండీ హోమాలను పూర్తిచేశారు. మరకత శక్తి కాళీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం 9గంటలకు రుత్వికులు గణపతి హోమం తరువాత శత చండీ హోమాన్ని ప్రారంభించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధిపతి రమ్యానంద భారతి స్వామి హోమాన్ని పూర్ణాహుతితో ముగించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది.

టీడీపీతోనే ప్రజా సంక్షేమం



చంద్రగిరి, ఏప్రిల్ 21: ముంగిలిపట్టు, ఎం.కొంగరవారిపల్లె, బోడెంబాయి గ్రామాల్లో ఆదివారం మీ ఇంటికి మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రగిరిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దిలీప్‌కుమార్, హరి నాయుడు, రాధా, సుశీలమ్మ, అమ్ములు, నవనీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని బోరు మోటరు

20 రోజులుగా తాగునీటి కష్టాలు



పాకాల, ఏప్రిల్ 21: మండలంలోని ఇరంగారిపల్లెలో పంచాయతీ బోరు మరమ్మతులకు నోచుకోకపోవడంతో గ్రామస్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కేంద్రమైన ఈ గ్రామంలో వందకు పైగా కుటుంబాలు ఉన్నాయి. రెండు నీటిబోర్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉన్నాయి. 20 రోజుల క్రితం ఒక బోరు మోటరు మరమ్మతులకు గురైంది. మరమ్మతులు చేయకపోవడంతో ఒక బోరులో వచ్చే అరకొర నీటితో 5 రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామంలో పశుపోషణ కారణంగా నీటి అవసరత ఎక్కువగా ఉంది. ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే బోరు మోటరును మరమ్మతు చేసి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు 23 వరకు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 21 : పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునేందుకు కల్పించిన అవకాశాన్ని 23వ తేదీ వరకు పొడిగించినట్లు చిత్తూరు కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బందికి జిల్లాలో ఓటు హక్కు ఉంటే వినియోగించుకునేందుకు ఫారం-12 పూరించి, ఈ నెల 23వ తేదీలోగా ఆయా శాఖల హెచ్‌వోడీలకు అందజేయాలని పేర్కొన్నారు. గతంలో 22వ తేదీ వరకు ఉన్న ఈ అవకాశాన్ని పలువురు ఉద్యోగుల విన్నపం మేరకు ఒకరోజు పొడిగించామని వివరించారు. ఇతర జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది చిత్తూరు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నట్లయితే అట్టివారు ఫారం-12, అనెగ్జర్ 12(ఇ)ని హెచ్‌ఓడీల ద్వారా కలెక్టర్‌కు సమర్పించాలని తెలిపారు.గడువులోగా ఫారాలు అందించకుంటే వారు సొంత నియోజకవర్గాలకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాల్సి ఉంటుందని వివరించారు. అటువంటి వారికి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే వెసులుబాటు ఉండదని తెలిపారు.

డిన్నర్‌కు వెళుతూ తిరిగిరాని లోకాలకు..



మృతి చెందిన శ్రీనివాసులు

చౌడేపల్లె, ఏప్రిల్ 21 : ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని బిల్లేరుగౌడుఇండ్లుకు చెందిన రామకృష్ణ గౌడ్ కుమారుడు శ్రీనివాసులు(47) అదే గ్రామానికి చెందిన గురుమూర్తితో కలసి బైక్‌లో బోయకొండలో డిన్నర్‌కు బయలుదేరారు. మిట్టూరుకు చెందిన నరసింహులు కాగతి వద్ద ఉన్న మిల్లులో వడ్లు ఆడించుకుని ట్రాక్టర్‌లో తిరిగి వస్తున్నాడు. కాగతి నుంచి మిట్టూరుకు వెళ్లే మార్గంలో ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. గురుమూర్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరి

కన్నుల పండువగా ఊంజల్ సేవ



చంద్రగిరి, ఏప్రిల్ 21: చంద్రగిరి కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం సరస్వతీదేవి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఊయలలో అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ముని హరిబాబు, అర్చకుడు శ్రీనివాస భట్టర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన సందర్భంగా లోకేశ్‌ను సన్మానిస్తున్న పుదిపట్ల సర్పంచ్ బడి సుధా యాదవ్

దాడిలో గాయపడ్డ వృద్ధురాలి మృతి

రామచంద్రాపురం, ఏప్రిల్ 21: రామచంద్రాపురం మండలం అనుపల్లి పంచాయతీ నెమలగుంటలో ఈ నెల 5వ తేదీన రెండు వర్గాల మధ్య జరిగిన దాడిలో గాయపడ్డ ఈశ్వరమ్మ(70)అనే వృద్ధురాలు రుయాలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఎస్‌ఐ చిరంజీవి మృతదేహానికి శవపంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువపై ఇల్లు కట్టేశారు!



మంగళం, ఏప్రిల్ 21: మంగళం గ్రామంలోని ఓ కాలువ, రోడ్డు సైతం కబ్జా చేయడానికి పక్కా ప్రణాళికతో రేకుల ఇల్లు నిర్మించారు. ఇంత జరిగినా ఇటు రెవెన్యూ అధికారులు కానీ అటు పంచాయతీ అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా కాలువలను ఆక్రమించి ఇల్లు నిర్మిస్తే మురుగు, వరదనీరు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 21: భారత ప్రజాసంబంధాల సొసైటీ (పీఆర్‌ఎస్‌ఐ), తిరుపతి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 37వ జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవం ఘనంగా జరిగింది. ఎదుగుతున్న భారతం - సనాతన విలువలు, ప్రజాసంబంధాల పాత్ర అనే అంశంపై స్థానిక ఎయిర్ బైపాస్‌లోని యూత్ హాస్టల్‌లో సభ జరిగింది. శతావధాని ఆముదాల మురళి ప్రసంగించగా, మహిళా వర్సిటీ ఆచార్యులు యువశ్రీ, పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి శాఖ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు ఎం.చంద్రమోహన్, కోశాధికారి సి.రాఘవ, ప్రముఖ రచయిత ఆర్‌సి కృష్ణస్వామి రాజు, ఎస్పీడబ్ల్యూ పూర్వ ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, రమాకాంతశర్మ, తోట వెంకటేశ్వర్లు, రచయిత కలువగుంట రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్గానిక్ మేళా



విజయ్‌రామ్, ఆచార్య చక్రవర్తి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21: తిరుపతి మహతి వేదికలో రెండ్రోజులుగా జరిగిన తిరువడి సంత ఆదివారం ముగిసింది. కనెక్ట్ 2 ఫార్మర్ పేరుతో ప్రతి నెలా నిర్వహించే సంతలో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి పండ్ల మొక్కల పెంపకంపై విజయ్‌రామ్ ప్రసంగించారు. అనంతరం ఆచార్య చక్రవర్తి మాట్లాడుతూ గ్రామాలు స్వయం సమృద్ధి నుంచి ఎరువుల కంపెనీలపై ఆధారపడేలాగా మారిపోయాయన్నారు. విదేశీ కంపెనీలు వేప వంటి మన సంపదను మనకు కాకుండా చేసి, రసాయన ఎరువులతో భూమిని సారరహితం చేశాయన్నారు. ఇకనైనా రైతులు సేంద్రియ సాగు వైపు మళ్లాల్సిన అవసరం వచ్చిందన్నారు. సాయంత్రం 5గంటలకు ప్రకృతివనం ప్రసాద్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనశైలికి నవీన మానవుడు అనుసరించాల్సిన భోజనవిధానాన్ని తెలియజేశారు.

బీఫామ్ అందుకున్న పులివర్తి నాని



తిరుచానూరు, ఏప్రిల్ 21: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు చేతుల మీదుగా తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని బీఫామ్ అందుకున్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పులివర్తి నాని బీఫాం అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సహకారం, సమన్వయంతో పనిచేసి రానున్న ఎన్నికల్లో చంద్రగిరి కోటపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేస్తామని, 20 ఏళ్ల కల సాకారం చేసి గెలుపును కానుకగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు.

చంద్రగిరి కోటపై టీడీపీ జెండా ఎగురవేద్దాం

- ఆత్మీయ సమావేశంలో డాలర్స్ దివాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 21: కూటమి నాయకులందరూ ఐక్యంగా పనిచేసి ఈసారి చంద్రగిరి కోటపై టీడీపీ జెండాను ఎగురవేద్దామని తిరుపతి రూరల్ మండల పార్టీ నేత, డాలర్స్ గ్రూప్స్ చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రూరల్ మండలంలోని కాలూరు క్రాస్‌వద్ద ఉన్న బీజీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అరాచకాలు, ఆక్రమణలు, దౌర్జన్యాలు, దోపీడీలను హద్దూ అదుపు లేకుండా సాగించారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో మంచి నాయకుడైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని అఖండ మెజారిటీ గెలిపించుకుని చంద్రగిరిని చంద్రబాబుకు కానుకగా అందిద్దామని చెప్పారు.

నా తండ్రి 50వేల మందిని పేరుపెట్టి పలకరిస్తారు: వినీల్

పులివర్తి నాని తనయుడు వినీల్ మాట్లాడుతూ.. తన తండ్రి నానిది నాన్ లోకల్ అని మోహిత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో 50వేల మందిని పేరుపెట్టి తన తండ్రి పలకరిస్తారని.. అదే మీరు కానీ, మీతండ్రి కానీ అలా పలకరించగలరా? అని సవాల్ విసిరారు.

టీడీపీకి మరింత బలం: సుధారెడ్డి

టీడీపీ మహిళానేత పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసేవ చేయాలన్న ఆలోచన ఉన్నవారు టికెట్‌ని ఆశించడంలో తప్పులేదని, ఆదిశగానే దివాకర్‌రెడ్డి టీడీపీ టికెట్‌ని ఆశించారని తెలిపారు. అయితే చంద్రబాబు ఎవరికి టికెట్ కేటాయించినా పార్టీకోసం పనిచేస్తానని చెప్పి టీడీపీలో చేరడాన్ని హర్షిస్తున్నామని అన్నారు. ఇటువంటి నాయకుల రాకతో పార్టీబలం మరింతగా పెరిగిందని చెబుతూ ఆయన్ను అభినందించారు. అంతకుముందు దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పలువురునేతలు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, జనసేన నేత దేవర మనోహర్, బీజేపీ నేత పురుషోత్తమ నాయుడు, రైతుసంఘ నాయకులు శివకోటి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, నాగరాజు నాయుడు, మురళి, తుమ్మలగుంట గ్రామ టీడీపీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి: కలెక్టర్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21: మే 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఓటర్లను చైతన్యపరిచే స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుపతి నగరంలోని ఎంఆర్ పురం సర్కిల్ నుంచి లక్ష్మీపురం సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. అంతకుముందు ప్రజలు, విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ.. మే13న జరిగే పోలింగ్ రోజున ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటును నిర్భయంగా నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరపాలక కమిషనర్ అదితిసింగ్, అధికారులు మురళీకృష్ణ, అమరయ్య, బాలకొండయ్య, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైలో రేపు చిత్రా పౌర్ణమి

- గిరిప్రదక్షిణకు లక్షల్లో రానున్న భక్తజనం
- ప్రత్యేక బస్సులు నడుపుతున్న అధికార యంత్రాంగం

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23వ తేదీ పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణకు 25 లక్షల మంది భక్తులు రావొచ్చని జిల్లా యంత్రాంగంతో పాటు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. తిరువణ్ణామలైకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా భారీసంఖ్యలో ప్రత్యేక బస్సులు నడిపేలా రవాణా శాఖ దృష్టిసారించింది. అలాగే, అరుణాచలేశ్వర స్వామిని దర్శించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రాజగోపురం ప్రవేశద్వారం నుంచి ఆలయంలోకి అడుగుపెట్టే భక్తులకు ఉచిత దర్శనంతోపాటు ప్రత్యేక దర్శనం కూడా ఏర్పాటుచేసినట్టు అధికారులు తెలిపారు. గిరిప్రదక్షిణ చేసేందుకు 23వ తేదీ వేకువజామున 4.16 నుంచి 24వ తేదీన తెల్లవారుజామున 5.47 గంటల వరకు శుభ సమయమని వారు తెలిపారు. అయితే, 23వ తేదీ మంగళవారం పగటిపూట గిరి ప్రదక్షిణ చేసే భక్తులు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గిరి ప్రదక్షిణ సాగే 14కిలోమీటర్ల కొండ చుట్టూ గుర్తింపు కార్డులు, ముందస్తు అనుమతి పొందిన వారే అన్నదానాలు చేయాలని వారు కోరారు.

1200 ప్రత్యేక బస్సులు...

23వ తేదీ చిత్ర పౌర్ణమి కావడంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి 1200 బస్సులు నడిపేలా రవాణా శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం తిరువణ్ణామలై పట్టణంలో 9 తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేశారు. చెన్నై నుంచి తిరువణ్ణామలై వచ్చే భక్తుల సౌకర్యార్థం బస్సులను దిండివనం బైపాస్ రోడ్డులో పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. సేలం, తిరుపత్తూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల బస్సులు చెంగంరోడ్డులో పార్కింగ్ చేసేలా, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే బస్సులు వేంగికాల అన్నా జంక్షన్ వద్ద పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అలాగే, చెన్నై, వేలూరు, విల్లుపురం ప్రాంతాల నుంచి తిరువణ్ణామలైకు నడిపే ప్రత్యేక రైళ్ల వివరాలను సోమవారం ప్రకటించనున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో ఆటోలు సహా ఇతర వాహనాలను అనుమతించరని పోలీసులు తెలిపారు. దివ్యాంగులకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు.

టీడీపీ ప్రభంజనం ఖాయం

- చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దగ్గుమళ్ల, సీఆర్ రాజన్

తిరుచానూరు, ఏప్రిల్ 21: రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో రోజురోజుకు పెరిగిపోతున్న టీడీపీ ప్రభంజనంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తిరుచానూరు పంచాయతీలోని రంగనాథంవీధి, వేపమానువీధి, రేణిగుంటరోడ్డు ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులతో కలిసి వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పల్లెకు వెళ్లినా ప్రజలు టీడీపీ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ వారు ఓటుకు రూ.10వేలు ఇచ్చినా ప్రజామద్దతు తమకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వారిని టీడీపీ నాయకులు భారీ గజమాల, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు కిషోర్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, హరిరాంరెడ్డి, దామినేడు రమేష్, సాల్మాన్‌రాజు, కలీమ్, మోహన్‌రెడ్డి, రమణరాయల్, జనసేన వెంకట్‌రాయల్, బీజేపీ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

106 మందికి కంటి పరీక్షలు



పాకాల, ఏప్రిల్ 21: పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్య బృందం మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహకారంతో 106 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 17 మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు, కార్యదర్శి ఎం.జగదీశ్వరి, ప్రతినిధులు పాల్గొన్నారు.

నృత్యం ముగ్ధమనోహరం



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, ఏప్రిల్ 21: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి తిరుపతికి చెందిన రాధిక నృత్య కళానికేతన్‌కు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ముగ్ధమనోహరంగా సాగింది. పలు అన్నమయ్య కీర్తనలకు వారు ప్రదర్శించిన నాట్యం ఆహూతులను అలరించింది. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవలి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

వాడవాడలా సీతారాముల కల్యాణం



గరుడ వాహనంపై ఊరేగుతున్న సీతారాములు

రామచంద్రాపురం, ఏప్రిల్ 21: గంగిరెడ్డిపల్లె, నడవలూరు, కమ్మకండ్రిగ, పద్మవల్లిపురం గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు ఆదివారం సీతారాముల కల్యాణం వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగింది. రాత్రి 8గంటల ప్రాంతంలో గరుడ వాహనంపై సీతారాములు ఊరేగారు. గ్రామస్థులు మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

చంద్రగిరిలో కాంగ్రెస్ ప్రచారం

చంద్రగిరి, ఏప్రిల్ 21: ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సాయంత్రం చంద్రగిరిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చంద్రగిరి జాతీయ రహదారి నుంచి టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండలాధ్యక్షుడు రాజేంద్ర, సాయిచంద్రిక, జయచంద్రారెడ్డి, ఉషారెడ్డి, కలీందర్, ముని, రాజశేఖర్‌రెడ్డి, మల్లయ్యపల్లి సురేష్, రామ్మూర్తి, నాగరాజకుమారి, హసీనా, కల్పన, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

కరకంబాడిలో వైసీపీ నాయకుల దౌర్జన్యం

- సీఐ సహకారంతో నా స్థలాన్ని కబ్జా చేశారు
- మీడియా ఎదుట బాధితుడి ఆవేదన



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రనాథ్

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21: కరకంబాడిలో వైసీపీ నాయకులు దౌర్జన్యం చేయడంతోపాటు తన స్థలాన్ని కబ్జా చేశారని సురేంద్రనాథ్ మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరాలు తెలిపారు. ఆయన మాటల్లోనే.. 'రేణిగుంట మండలం కరకంబాడి గ్రామ లెక్క దాఖలాలోని సర్వే నెంబర్లు 170-3ఎ1, 170-3ఎ2లో 13.5 సెంట్ల భూమిని గత ఏడాది ఫిబ్రవరి 16న పోలిశెట్టి విశ్వనాథం కుటుంబీకుల నుంచి మా కుటుంబం కొనుగోలు చేసింది. అప్పటి నుంచి మా వెనుక స్థలం కల్గిన వారికి అమ్మేయాలని వైసీపీ నాయకులు లింగం రమేష్, బాబురావు, టి.వెంకటరత్నం, బాలాజి, ఎస్.రమేష్‌లు వారి అనుచరులతో బెదిరిస్తూ వస్తున్నారు. అయినా మా స్థలంలో దుకాణాలు కట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నాం. ఆ తర్వాత కూడా మా స్థలాన్ని కబ్జా చేయాలని చూడటంతో గత ఏడాది మార్చిలోనే ఎస్పీకి ఫిర్యాదు చేశాం. అయినా పోలీసుల నుంచి న్యాయం జరగలేదు. మరోవైపు ఈనెల 17వ తేదీ రాత్రి సమయంలో దుకాణం వద్ద నాపరాళ్లు అన్‌లోడ్ చేస్తుండగా సీఐ మల్లికార్జున వచ్చి నా కుమారుడు, అన్నను కొట్టి జీపులో ఎక్కించుకెళ్లిపోయారు. మరుసటి రోజున స్టేషన్‌కి వెళితే దుర్భాషలాడి, మాపైనే తప్పుడు కేసు పెట్టి, విడిచిపెట్టారు. దీనిపై అదే రోజు సాయంత్రం ఎస్పీకి ఫిర్యాదు చేశాం. ఎస్పీకి ఫిర్యాదు చేస్తావా.. అని వైసీపీ నాయకులు శనివారం ఉదయం మా దుకాణాల వద్ద కొచ్చి లోపలున్న రూ.14లక్షల విలువైన సిమెంట్, రేకులు, ఇటుక రాళ్లు, కడప నాపరాళ్లను ఎత్తి రోడ్డున పడేశారు. మరోసారి ఈ స్థలంవద్ద కొస్తే చంపుతామని బెదిరించారు. సీఐ సహకారంతోనే ఇదంతా చేస్తున్నారు' అని సురేంద్రనాథ్ వివరించారు. ఈ సమావేశంలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ నాయకుడు రెడ్డి శేఖర్ రాయల్, బాధితుడి కుటుంబీకులు పాల్గొన్నారు.

మద్యం కేసు నుంచి తప్పించుకునే యత్నం

చిత్తూరు, ఏప్రిల్ 21 : మూడు రోజుల క్రితం చిత్తూరు నగరంలోని ఓ కారు షెడ్డులో దొరికిన మద్యం కేసు నుంచి తప్పించుకునేందుకు వైసీపీ నేత ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కొంగారెడ్డిపల్లె పరిధిలోని ఓ కారు షెడ్డులో అక్రమంగా దాచివుంచిన 170 కేసుల మద్యం పోలీసులకు దొరికింది. అధికార పార్టీకి చెందిన నేత షెడ్డు కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే దీని నుంచి తప్పించుకునేందుకు సదరు నేత కారు షెడ్డు ఉన్న స్థలాన్ని వేరొకరి పేరు మీద పాత తేదీలతో రెంటల్ అగ్రిమెంటును తయారు చేస్తున్నట్లు తెలిసింది.

రుయాలో వృథాగా బ్యాటరీ వాహనాలు

- రోగులకు తప్పని అవస్థలు



మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారిన బ్యాటరీ వాహనాలు, అతికష్టం మీద రోగిని స్ట్రెచ్చర్‌లపై తీసుకువెళుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 21: రుయాస్పత్రికి నడవలేని స్థితిలో వచ్చే రోగులను గతంలో దాతలు ఇచ్చిన బ్యాటరీ వాహనాలపై తీసుకువెళ్లేవారు. కొంత కాలంగా ఈ వాహనాలు మరమ్మతులకు గురికావడంతో మూలన పడేశారు. వీటితోపాటు గతంలో ఉన్న టాటా సుమో వాహనం కూడా మరమ్మతులకు గురవడంతో అదీ కనుమరుగైంది. దీనికితోడు ఎఫ్‌ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు కూడా కొరతగా ఉండటం, ఉన్న వారిలో కొందరు ఓటీలకే పరిమితం కావడంతో రోగులను తీసుకువెళ్లేందుకు వారిసహాయకులకు తిప్పలు, రోగులకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు దృష్టిసారించి బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

కమ్మసంఘం భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 21: పవిత్ర పుణ్యక్షేత్రంలో కమ్మ సంక్షేమ సంఘం (కాస్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అంతర్జాతీయ కమ్మ భవనం నిర్మాణానికి భూమిపూజ వేడుకగా జరిగింది. తిరుపతి - బెంగళూరు జాతీయ రహదారిలో వకుళమాత ఆలయానికి సమీపంలో ఎకరా స్థలంలో నిర్మించే ఈ భవనానికి కాస్ నిర్వాహకులు భూమి పూజ చేశారు. ఇందులో కాస్ అధ్యక్షుడు పులిపాటి పురంధర నాయుడు, కార్యదర్శి దేవబత్తిని గురప్ప నాయుడు, నిర్వాహక కార్యదర్శి వేమూరి జయరాం ప్రసాద్, కోశాధికారి తమ్మినేని వెంకటేశ్వర్లు ఇతర కార్యవర్గం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు రూ.1.5 కోట్ల విరాళం చెక్కులను కొల్లూరి ఇందుశేఖర్ అందజేశారు. హైదరాబాదు అమీర్‌పేట కమ్మ సంఘం రూ.కోటి విరాళం ప్రకటించింది. భూమిపూజ మహోత్సవంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య మురళి, విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదర నాయుడు, ఆచార్య కిరణ్‌క్రాంత్ చౌదరి, డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల, తుమ్మల రమేష్ చంద్రబోస్, చలసాని వెంకటేశ్వరరావు (సి.వి.రావు), సతీష్ వేమన, నన్నపనేని నాగేశ్వరరావు, రావెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

వైసీపీకి ఓటేస్తే ఫ్యాన్‌కు ఉరేసుకోవాలి

● తెలుగు యువత



ఉరి తాడు, ప్లకార్డులను చూపుతున్న రవి నాయుడు తదితరులు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21: రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి ఓట్లు వేస్తే విద్యుత్ బిల్లులు చెల్లించలేక ఫ్యాన్‌కు ఉరేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు హెచ్చరించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ అధికారంలోకి రాక ముందు విద్యుత్ చార్జీలు పెంచేది లేదని హామీ ఇచ్చారని చెప్పారు. అయితే ఐదేళ్ల పాలనలో ఎనిమిది పర్యాయాలు పెంచి, ప్రజలపై మోయలేని భారాన్ని మోపారని విమర్శించారు. వేసవిలో విద్యుత్ కోతలు పెరిగి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. అసమర్థ పాలనను తిరస్కరించడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేవరకు తెలుగు యువత పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు. నాయకులు శ్రీనివాసులు, కృష్ణయ్య, సందీప్, వాసు, శ్రీనివాస యాదవ్, గోపి, శివ పాల్గొన్నారు.

బీసీ మేయర్‌ను పావుగా వాడుకుంటున్న భూమన

● ఎన్డీయే కూటమి నాయకులు



వివరాలు తెలియజేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి, ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21: బీసీ మేయర్ శిరీషను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డిలు పావుగా వాడుకుంటున్నారని ఎన్డీయే కూటమి నాయకులు జి.భానుప్రకాష్ రెడ్డి, ఆర్.సి.మునికృష్ణ ఆరోపించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. మేయర్‌గా బీసీ మహిళకు అవకాశం ఇచ్చి, ఆమె హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. తిరుపతిలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు వైసీపీ అన్యాయం చేస్తుందని ఆగ్రహించారు. బీసీలు ఈ విషయాన్ని గుర్తించి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కూటమి నాయకులు శేఖర్, సుబ్రమణ్యం యాదవ్, సుభాషిణి, జీవన్ రాయల్, నరసింహులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో జీపు బోల్తా

● ఐదుగురు చెన్నై భక్తులకు గాయాలు





ప్రమాదానికి గురైన జీపు - భక్తులను అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్‌లో ఓ జీపు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు భక్తులు గాయపడ్డారు. చెన్నైకి చెందిన ఐదుగురు భక్తులు శ్రీవారి దర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం ఓ జీపులో తిరుమలకు బయల్దేరారు. మార్గమధ్యంలో జీపు అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో 50 ఏళ్ల వయసున్న ఓ మహిళకు తీవ్రగాయాలవగా, మిగిలిన నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితులను తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించి, వైద్యం అందించారు. కాగా, రోడ్డుపై జీపును తొలగించి, ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు.

అమ్మ ముచ్చట్లు పుస్తకావిష్కరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21: సీనియర్ పాత్రికేయుడు ఆలూరి రాఘవశర్మ తన తల్లి జ్ఞాపకాలతో రూపొందించిన అమ్మముచ్చట్లు పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఉదయం వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సీనియర్ నాటక, సినీ నటుడు కాకరాల ముఖ్యఅతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. పద్మావతి మహిళా కళాశాల విశ్రాంత అధ్యాపకులు ప్రేమావతి మాట్లాడుతూ.. రచయితకు తన తల్లితో ఉన్న అనుబంధాన్ని ఇందులో చూడవచ్చన్నారు. ప్రముఖ రచయిత్రి కాంతినల్లూరి పుస్తక పరిచయం చేశారు. ఆకాశవాణి విశ్రాంత సంచాలకుడు ఆకుల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించగా, వేమన విజ్ఞాన వేదిక కార్యదర్శి నాగార్జున స్వాగతం పలికారు. సాకం నాగరాజు, పేరూరు బాలసుబ్రమణ్యం, నెమిలేటి కిట్టన్న, కిరణ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి తెప్పోత్సవాలు ప్రారంభం



తెప్పపై విహరిస్తున్న సీతారాములు

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 21: కోదండ రామస్వామి వారి తెప్పోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆలయంలోని మండపంలో స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఏడు నుంచి రాత్రి 8.30 గంటల వరకు సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా రామచంద్ర పుష్కరిణికి తీసుకొచ్చారు. తొలి రోజు స్వామివారు ఐదు చుట్లు తెప్పలపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, అధికారులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 21: తిరుపతిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 15 ఏళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి కథనం మేరకు కొర్లగుంటకు చెందిన చరణ్.. మోటరు సైకిల్‌పై సొంత పనిమీద సుబ్బారెడ్డినగర్‌కు ఫ్లైఓవర్‌పై బయల్దేరాడు. వేగంగా వెళుతూ డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రుయా ఆవరణలో మరోసారి అగ్ని ప్రమాదం

పదిరోజుల వ్యవధిలో అదే ప్రదేశంలోనే.. ● అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ అగ్నిమాపక సిబ్బంది మండిపాటు



టీబీ వార్డు పక్కన ఎగసిపడుతున్న మంటలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 21: రుయాస్పత్రి ఆవరణలో ఆదివారం రాత్రి మరోసారి అగ్ని ప్రమాదం జరిగింది. పది రోజుల కిందట జరిగిన ప్రదేశంలోనే మళ్లీ అదే రీతిలో అగ్ని ప్రమాదం జరగడం గమనార్హం. సాధారణంగా ఆస్పత్రి ఆవరణలో బయో వ్యర్థాలను ఒకరోజుకి మించి నిల్వ చేయకూడదు. కానీ రోజుల తరబడి బయో వ్యర్థాలను, ఆస్పత్రిలోని ఇతర చెత్తాచెదారాన్ని ఆవరణలోని ఒకేచోట నిల్వ చేస్తున్నారు. పైగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే టీబీ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందే వార్డుకు సమీపంలోనే డంపింగ్ యార్డును తలపించేలా వ్యర్థాలను నిల్వ చేస్తున్నారు. వీటికి పదిరోజుల కిందట కూడా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో టీబీ వార్డుతో పాటు ఇతర వార్డుల్లో పొగ కమ్ముకొని రోగులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఆ సమయంలోనే ఇలా నిల్వ చేయొద్దని అగ్నిమాపక అధికారులు సూచించారు. కానీ రుయా అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పారిశుధ్య నిర్వాహకులు తిరిగి అక్కడే యథావిధిగా వ్యర్థాలను నిల్వ చేశారు. ఈసారి కూడా గుర్తు తెలియని వ్యక్తులు మరోసారి నిప్పు పెట్టడంతో భారీ అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే మరోసారి ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది మండిపడ్డారు.

అరాచక శక్తులను తరిమికొట్టండి

● తిరుపతి అభివృద్ధికి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి
● జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి



గాజు గ్లాసుకు ఓటేయాలని కోరుతున్న ఆరణి శ్రీనివాసులు, నాయకులు

తిరుపతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పవిత్రతను దెబ్బతీసిన అరాచక శక్తులను తరిమి కొట్టాలని.. టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో తిరుపతి అక్రమాలకు కేంద్రంగా మారిందని ఆరోపించారు. ఇంటింటికి ప్రచారంలో భాగంగా 21, 22, 19, 20 డివిజన్లలో పర్యటించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి సూరా సుధాకర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరణిని అడుగడుగునా జనం ఘన స్వాగతం పలికారు. తిరుపతి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను జనసేన ఎన్నికల గుర్తయిన గాజు గ్లాసుపై, పార్లమెంటుకు బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వరప్రసాద్‌ని కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, చినబాబు, పాటకం వెంకటేష్, మహేష్ యాదవ్, రుద్రకోటి సదాశివం, ఆనంద్ గౌడ్, ఆముదాల తులసీరాం, బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, అజయ్ కుమార్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, లక్ష్మీపతి రాయల్, ఆకేపాటి సుభాషిణి పాల్గొన్నారు.



ఎస్వీనగర్లో ఆరణిని ఆప్యాయంగా పలుకరిస్తున్న వృద్ధురాలు

రేపు ఆరణి నామినేషన్

తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఎస్వీయూలోని ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఉదయం 9.30 గంటలకు ర్యాలీగా బయల్దేరి పూలే విగ్రహం, వెస్ట్ చర్చి, ఎంఆర్‌పల్లె సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోనున్నారు.

ఎన్డీయే కూటమికి బ్రాహ్మణ సంఘాల మద్దతు

తిరుపతి (ఆటోనగర్), ఏప్రిల్ 21: రాష్ట్రంలో బ్రాహ్మణులకు అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి మద్దతు ఇస్తున్నట్లు బ్రాహ్మణ సంఘాల నాయకులు కె.అజయ్ కుమార్, హనుమంతరావు, రామరాజు, రాంప్రసాద్‌లు వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయక పోగా, కార్పొరేషన్‌ను నాశనం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఏడాదికి రూ.1000 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఐదేళ్లలో బ్రాహ్మణుల జీవితాలు చితికి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాపు భవన్ అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిందేమీలేదు: జనసేన

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21: తిరుపతిలో కాపులకు(బలిజలు) మేలు చేశామని, కాపుభవన్ అభివృద్ధికి కృషి చేశానని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రచారం చేసుకోవడంలో వాస్తవం లేదని జనసేన నాయకుడు గుట్టా నాగరాజు రాయల్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతిలో ఎమ్మెల్యే, ఆయన తనయుడు డిప్యూటీమేయర్ అభినయ్‌రెడ్డిలు భూకబ్జాలకు పాల్పడిన విషయాన్ని జనం గమనిస్తున్నారన్నారు. భూకబ్జాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తిరుపతిలోని 70వేల మంది బలిజలు ఐకమత్యంతో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

దారి వదలక పోవడంతో ఘర్షణ: ఐదుగురికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 21: దారి వదలక పోవడంతో జరిగిన ఘర్షణలో ఐదుగురు గాయపడ్డారు. ఈస్ట్ సీఐ మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు. ఎస్టీవీ నగర్‌కి చెందిన వైసీపీ కార్యకర్తలు రవి, అనిల్, సాయి, మధు, హేమంత్ మరికొందరు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎస్టీవీనగర్ నుంచి బైరాగిపట్టెడకు ప్రచారం కోసం వైసీపీ జెండాలు పట్టుకుని వెళుతున్నారు. ఆ సమయంలో శివజ్యోతినగర్, ఎన్టీఆర్ కాలనీకి చెందిన భాను, కృష్ణవంశీ, విజయ్, తారకేష్, బాలు తదితరులు క్రికెట్ ఆడుకుని బైక్‌లపై ఇంటికి వెళుతున్నారు. వీరికి వైసీపీ కార్యకర్తలు దారి వదల్లేదు. బైక్‌పై వస్తున్న వారు ఎంత బతిమిలాడినా దారివ్వక పోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో వైసీపీ కార్యకర్తలను తమ వద్ద ఉన్న క్రికెట్ స్టంప్‌లతో బైక్‌పై వస్తున్నవారు చితకబాదారు. వైసీపీకి చెందిన ఐదుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఆదేశాలతో తూర్పు సీఐ మహేశ్వర రెడ్డి, ఎస్ఐ పురుషోత్తం, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులను చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'సీమ'లో బలిజలకు వైసీపీ ఒక్క సీటైనా ఇచ్చిందా?

'ఎన్డీయే'తోనే మనకు గుర్తింపు - పవన్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుందాం: 'బాస్' తీర్మానం



ఐక్యతను చాటుతున్న నాయకులు

తిరుపతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 'రాయలసీమలో ఒక్క సీటు కూడా కేటాయించకుండా బలిజలను వైసీపీ అవమానించింది. 'ఎన్డీయే'తోనే మనకు గుర్తింపు, న్యాయం జరుగుతుంది. ఇందుకోసం మనమంతా ఐక్యంగా నిలబడి పవన్ కల్యాణ్‌ను బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుందాం' అని బలిజ అభ్యుదయ సేవా సమితి (బాస్)తీర్మానం చేసింది. బాస్ నాయకుడు ఊకా విజయకుమార్, అధ్యక్షుడు మఠం సురేష్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి రూరల్ మండలం వీపీ అగ్రహారం వద్ద ఉన్న నిషాల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో వారు ప్రసంగించారు. తిరుపతి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు గెలిపించడంలో బాస్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. బలిజలు ఐక్యంగా ఉండడం వల్లే 2009, 2014 ఎన్నికల్లో చిరంజీవి, వెంకటరమణలను గెలిపించుకోగలిగామన్నారు. 2019 ఎన్నికల్లోనూ స్వల్ప ఓట్లతో సుగుణమ్మ ఓటమి చెందారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులును గెలిపించుకుని బలిజల ఐక్యత చాటాలని చెప్పారు. ప్రముఖ సినీ నిర్మాత ఏఎం రత్నం, బలిజ నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ, దాసరి రాము తదితరులు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రెడ్డి సామాజికవర్గానికి తప్ప తక్కిన కులాలకు ప్రాధాన్యం దక్కలేదని మండిపడ్డారు. ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాయలసీమలో ఒక్క టిక్కెట్ కూడా బలిజలకు ఇవ్వకుండా ముఖ్యమంత్రి అవమానించారని ధ్వజమెత్తారు. తిరుపతిలో బలిజ భవన్‌కు కేటాయించిన స్థలంలో ఐదు సెంట్లను ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పీఏ ఆక్రమించాడని ఆరోపించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే బలిజ భవన్ నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అతి పెద్ద సామాజికవర్గంగా బలిజలున్నా పదవుల కేటాయింపులో వివక్షకు గురవుతున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ అన్నారు. బాస్ నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కరుణానిధి, కంచి ప్రకాష్, ముక్కు సత్యవంతుడు, సామంచి శ్రీనివాస్, సోమల సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యారామంలో ఫొటోవాక్



మంగళం, ఏప్రిల్ 21: దివ్యారామంలో ఆదివారం మాక్రో ఫొటోవాక్ పేరుతో వినూత్నమైన కార్యక్రమం జరిగింది. మొబైల్ కెమెరాలతో సూక్ష్మ చిత్రాలు తీయడం ఎలా అనే అంశంపై మాక్రో ఫొటో నిపుణుడు ఐనేష్ సిద్ధార్థ మెళకువలు బోధించారు. తిరుపతి పరిసరాల్లోని ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీల నుంచి 20 మంది విద్యార్థులు ఈ ఫొటో వాక్‌లో పాల్గొన్నారు. తమ మొబైల్ కెమెరాలతో నీటి చెలమలు, అడవిలో సూక్ష్మ క్రిమికీటకాలను ఫొటోలు తీశారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల క్రిమికీటకాల స్వభావాల గురించిన అవగాహన కలుగుతుందని ఐనేష్ వివరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ప్రకటించింది. శనివారం 73,051మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా,34,599మంది తలనీలాలు సమర్పించారు.

ఎమరాల్డ్స్‌లో ఘనంగా 'ఈక్వెస్ట్'



తిరుపతి(విద్య), ఏప్రిల్ 21: తిరుపతి ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఈక్వెస్ట్ -24 కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. పలు విభాగాలో జరిగిన పోటీల్లో విద్యార్థులు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్, ఉప సంచాలకులు ఎం.మునిరత్నం, ప్రిన్సిపాల్ జాఫర్‌వలీ, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటూ... అభివృద్ధి చేస్తా: వరప్రసాద్





బలిజ ఆత్మీయ సమావేశంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో వరప్రసాదరావు - జగ్జీవన్‌రాం పార్కులో ఓట్లు అభ్యర్థిస్తూ...

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) ఏప్రిల్ 21 : నిత్యం అందుబాటులో ఉంటూ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని గత పదవీకాలంలో సైతం అభివృద్ధి చేశానని బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. ఆదివారం తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పార్కు, జగ్జీవన్‌రాం పార్కులో ఆయన వాకర్లను కలుసుకొని ఓట్లను అభ్యర్థించారు. తన హయంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మళ్లీ అభివృద్ధి చెందాలంటే అది బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితోనే సాధ్యమని ఆయన చెప్పారు. అనంతరం తిరుపతి నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన బలిజ ఆత్మీయ సమావేశంలో ఆయన తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు జనం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దళితులంటే జగన్‌కు చులకన భావమని చెప్పారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధి కన్నా విధ్వంసమే ఎక్కువగా జరిగిందని దీనిని సహించలేకే తాను ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానని చెప్పారు. ప్రస్తుతం తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధి కేంద్రప్రభుత్వ చొరవే అన్నారు. స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులన్నీ పక్కదారి పట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్య పనులకు సైతం నిధులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వమే మరోసారి పంచాయతీలకు నిధులను కేటాయించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ నాయకులు యుగంధర్, దామోదర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఈయూ తిరుపతి సర్కిల్ అధ్యక్షుడిగా గోపి



నాయకులను సన్మానిస్తున్న సభ్యులు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21: టెలికాం కాలనీలోని ఏపీఈఈయు 1104 యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన తిరుపతి సర్కిల్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షుడిగా వెలకటూరి గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని డిస్కం వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి ప్రకటించారు. యూనియన్ కార్యాలయంలో అన్ని డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం జరిగింది. యూనియన్‌లో తిరుపతి సర్కిల్ పరిధిలో ఖాళీగా వున్న స్థానాలను నియమించడానికి ఎన్నికలు జరిగాయి. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.వేణుగోపాల్, కార్యదర్శిగా వి.దేవేంద్రరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని కృష్ణమూర్తి తెలిపారు. నూతనంగా ఎన్నికైనవారిని డివిజన్ నాయకులు సత్కరించారు.

కాంగ్రెస్‌తోనే తిరుపతి అభివృద్ధి: చింతామోహన్



తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 21: కాంగ్రెస్ హయాంలోనే తిరుపతిలో అన్నివిధాలా అభివృద్ధి జరిగిందని, ఎంపీ అభ్యర్థి చింతామోహన్ అన్నారు. సింగాలగుంటలో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్యగమనిక

ఇదీ మందు



వైసీపీకి రాకుంటే కేసే

వైసీపీలోకి వస్తావా.. రావా... అని అలుపెరగకుండా పార్టీలోకి పిలుస్తూనే ఉన్నారు. టీడీపీ వదిలి నేను రాను సామీ.. ఉన్నతావులోనే కుదురుగా ఉంటా అని ఆయనా చెబుతూనే ఉన్నాడు. సామదానభేద దండోపాయాలు తెలిసిన నాయకులు కదా మన తిరప్తోళ్లు.. పిలిచీ పిలిచీ ఇంకన దండోపాయానికి దిగారు. కేసుల మింద కేసులు పెడుతూ ఇప్పటికన్నా రా..బ్బా అని పిలుస్తూనే ఉన్నారు. ఈ కత తిరుపతి 50వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం దళితవాడలో జరతగా ఉండాది. ఇక్కడ కాయం వెంకటరత్నం అనే తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉన్నారు. పిలిస్తే పలికే నాయకుడిగా డివిజన్‌లో పేరుంది. మంచి అనుచరులున్నారు. వెంకటరత్నంతో పాటు వీరందరినీ వైసీపీలోకి రమ్మని పిలుస్తున్నారు. రాకపోవడంతో కేసులు పెట్టిస్తున్నారు. దళితవాడలో వైసీపీ వర్గం ద్వారా చిన్నపాటి గొడవలు సృష్టించి తర్వాత పెద్దవిగా చేయడం... వాటిల్లో టీడీపీ సానుభూతిపరులపైనే కేసులు బనాయించడం చేస్తున్నారు. 2019లో ఒకటి, 2020లో రెండు, 2023లో నాలుగు కేసులు పెట్టించారు. 30మంది టీడీపీ సానుభూతిపరులు, పదిమంది మహిళలూ ఇప్పటికే బాధితులయ్యారు. పెడితే పెట్టుకోండి కేసులు.. అంటూ వీరంతా వెరవకుండా గట్టిగా నిలబడ్డారు.

-తిరుపతి (జీవకోన)



పార్టీ పాయ పేరూ పాయ!

రాజకీయాల్లో ఓడలు బండ్లవడం సహజమే. సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ అంటేనే ఆ కుటుంబంగా, ఆ కుటుంబం అంటేనే టీడీపీగా దశాబ్దాల పాటు నడిచింది. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఏ ఎన్నికల్లో అయినా వారు చెప్పినవారికే టికెట్ ఇవ్వడం ఆనవాయితీగా నడిచింది. ఆ కుటుంబంలో అన్న మరణించాక తమ్ముడు ఆ వారసత్వాన్ని కొనసాగించారు. నియోజకవర్గంలో ఆయన మాటే శాసనంగా నడిచింది. ఆయనకు జిల్లా స్థాయిలో మంచి పదవి కూడా పార్టీ ఇచ్చింది. అయితే టీడీపీ అధికారం కోల్పోవడంతోనే వారి తీరు మారిపోయింది. వేధింపులు, కేసులతో దూకుడు ప్రదర్శించిన వైసీపీని ఎదుర్కోలేక తెరమరుగైపోయారు. కేసులు ఎదుర్కొనే పార్టీ శ్రేణులకు అండగా ఉండలేదు. దాంతో కేడర్ కూడా ఆ నాయకుడితో సంబంధం లేకుండా ముందుకు నడవడం అలవాటు చేసుకున్నారు.ఉలుకూ పలుకూ లేకుండా మాయమైపోయిన ఆయన హఠాత్తుగా ఎన్నికలకు ముందు నేనొచ్చేశానోచ్! అంటూ ఊడిపడ్డారు. పార్టీ పగ్గాలు ఎవరూ అప్పగించకుండానే చేతికి తీసుకున్నట్టుగా మాట్లాడారు. మళ్లీ టీడీపీ పునర్వైభవం చూస్తారని చెప్పారు.అటు పార్టీ అధిష్టానం గానీ, ఇటు స్థానిక నాయకులు గానీ ఆయన మాటలు నమ్మలేదు. అభ్యర్థి ఎంపిక విషయంలోనూ ఆయన అభిప్రాయం అడగలేదు. దీంతో అలిగిన ఆ నాయకుడు ఏకంగా వైసీపీలో చేరిపోయాడు. యథాప్రకారం మందిలో ఒకడిగా ఉనికి లేకుండా మిగిలిపోయాడు. ఆయన గత వైభవం కళ్లజూసిన తరం మాత్రం అయ్యో.. ఎట్లా బతికిన కుటుంబం.. అని నిట్టూరుస్తున్నారు.

- తడ

ఇదేంది మస్తానమ్మా.?



ఉల్లంఘనులు

ఆమె రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన పదవిలో ఉన్నారు. అందులోనూ అధికార భాషా సంఘం సభ్యురాలు. నెలకు లక్ష రూపాయలకు పైగా ప్రజాధనాన్ని వేతనంగా అందుకుంటున్నారు. కానీ అవేవీ ఆమెకు పట్టవు. వైసీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే పనిగా పెట్టుకున్నారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి గెలుపు కోసం ఆయన తండ్రి కరుణాకర్‌రెడ్డి చేపడుతున్న ప్రచారంలో ఈమె మహిళా కార్యకర్తలా పనిచేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు తెలియనట్టు కరపత్రాలను పంచుతూ కనిపిస్తున్నారు. అంతేకాదు అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన సామాజిక వర్గాన్ని ఏకం చేసి, వైసీపీకి ఓట్లుగా మార్చే పనిలోనూ బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

డిపాజిట్ దక్కడం అంటే...!

నోట్ దిస్ పాయింట్

'ఎన్నికల్లో మనోడికి డిపాజిట్ దక్కలేదు బాసూ' అనే మాట వింటూ ఉంటాం. ఇంతకీ డిపాజిట్ దక్కకపోవడం అంటే ఏమిటో తెలుసా? ఎన్నికల్లో పోటీ చేసేవారు 1951 ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం కొంత డబ్బు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అయితే జనరల్ కేటగిరి వాళ్లు రూ 10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ 5 వేలు డిపాజిట్ కింద చెల్లించాలి. ఎంపీ అభ్యర్థులైతే 25 వేలు, రిజర్వేషన్ స్థానాల్లో అయితే 12.5 వేలు చెల్లించాలి. నామినేషన్ వేసే సమయంలో ఈ సొమ్ము చెల్లించాల్సి వుంటుంది. ఓట్లు లెక్కింపు పూర్తి అయిన తర్వాత విజయం సాధించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లల్లో ఆరింట ఒకవంతు అంటే 16.6 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్ము వెనక్కి తిరిగి ఇచ్చేస్తారు. మిగిన వారికి ఇవ్వరు. అందుకే డిపాజిట్ కూడా దక్కలేదు అంటారు.

- వెంకటగిరి

ఆటోలకు డిమాండ్



ఎన్నికల పుణ్యమా అని ఆటోవాళ్లకి గిరాకీ పెరిగింది. రోజంతా తిరిగితే ఆరేడు వందలు చేతికొచ్చేది ఎక్కువ. ఇప్పుడు ఎన్నికల ప్రచార అవసరాల కోసం ఆటోలను పార్టీలు ముందు బుక్ చేసేసుకుంటున్నాయి. వీటిని ప్రచారరథాలుగా మార్చేసుకుని పల్లెలు తిప్పుతున్నాయి. మండలానికి పది నుంచి పదిహేను ఆటోలు ఇలా తిరుగుతున్నాయి.కొందరు ఆటోలకు డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసి అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమాలు ప్రదర్శిస్తుండగగా, మరి కొందరు ఆటోల్లో అభ్యర్థుల పేరున పాటలు రికార్డు చేసి వినిపిస్తున్నారు. ఎన్నికల ఆటోలకు రోజుకి వెయ్యి రూపాయలు ఇస్తున్నారు. భోజనం కూడా పార్టీలదే. దీంతో ఎన్నికలొచ్చినపుడే కదా నాలుగు రూపాయలు సంపాయించుకోవాలి అని ఎండలు మండుతున్నా లెక్క చేయకుండా ఆటోలవాళ్లు ప్రచారాల్లో బిజీగా ఉంటున్నారు. ఈ ఎఫెక్ట్ సాధారణ ప్రయాణికుల మీద పడింది. ఆటోలు దొరకడం అటుంచి రేట్లు పెంచేశారు.

- వెంకటగిరి



పులికాట్‌లో పూడిపోయిన జగన్ హామీ

● ఎన్నికల ముందు శంకుస్థాపన డ్రామా ● అభాసుపాలయిన సీఎం ప్రకటన

"నేను అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపే పులికాట్ సరస్సులో పూడిక తీయిస్తాను. దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపిస్తాను. మత్స్యకారుల కళ్లలో ఆనందం నింపుతాను."

2018 మార్చిలో నాయుడుపేటలో పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీ ఇది.

జగన్ కోరుకున్నట్టే అధికారం లభించింది. ఈమాట చెప్పి సరిగ్గా ఆరేళ్లు పూర్తయింది. పూడిక తీసి, పులికాట్‌కి ప్రాణం పోశారా?

తడ

సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో విస్తరించిన పులికాట్ ఉప్పునీటి సరస్సులో రెండు వంతులు ఏపీలో వుండగా ఒక వంతు తమిళనాడులో వుంది. సరస్సులోకి సముద్రపు నీరు ప్రవేశించేందుకు వాకాడు మండలం పూడిరాయదొరువు, కొండూరుపాళేల వద్ద రెండు ముఖద్వారాలున్నాయి. తమిళనాడులో మరొకటి ఉంది. 40 ఏళ్ల కిందటి వరకూ ముఖ ద్వారాల వద్ద ఏటా పూడిక తొలగించేవారు. దీంతో సరస్సులో సముద్రపు నీరు ఏడాది పొడవునా నిలిచి వుండేది. మత్స్యకారులకు ఉపాధిగా నిలిచేది. సైబీరియా నుంచీ ఏటా వచ్చే లక్షకు పైగా వలస పక్షులు విడిది చేసేవి.

మత్స్యకారుల నోట మట్టి

సరస్సులో పూడిక తొలగించకపోవడంతో 18 మత్స్యకార గ్రామాల్లోని 12,500 మంది మత్స్యకారులకు ఉపాధి కష్టమైంది. మట్టి మేటతో సముద్రపు నీరు సరస్సులోకి రావడం లేదు. వర్షాకాలంలో మూడు నెలలు మాత్రమే వస్తోంది. గతంలో 62 రకాలకు చెందిన 1200 టన్నుల మత్స్య సంపద ద్వారా ఏటా రూ.350 కోట్ల నుంచీ రూ.500 కోట్ల మేర వ్యాపారం జరిగేది. 117 రకాల విదేశీ పక్షులు ఏటా అక్టోబరులో వచ్చి విశ్రాంతి తీసుకునేవి. గుడ్లు పొదిగి పిల్లలు కాస్త పెద్దవయ్యాక వెనుదిరిగేవి. పూడికతీత పనులు జరగక, ఆహారం దొరక్క ఏటా వాటి రాక తగ్గుముఖం పడుతోంది.

ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు

పులికాట్ పూడికతీత విషయంలో వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. టీడీపీ ప్రభుత్వం గతంలో రూ.48 కోట్లు కేటాయించింది. పనులు మొదలయ్యేసరికి ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ నేతలు మాటలు చెబుతున్నారేగాని పనులు కావడం లేదు. పూడికతీత సమస్య మత్స్యకారులను వెంటాడుతూనే ఉంది.



- బొమ్మన శ్రీధర్, మాజీ జడ్పీటీసీ, తడ

పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించిన చంద్రబాబు

2018 జనవరి 7న నెల్లూరుకు వచ్చిన నాటి సీఎం చంద్రబాబు పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించి పులికాట్‌లో పూడికతీతకు రూ.48 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. సర్వే చేయాలని సకాన్ సంస్థకు ఆదేశాలిచ్చారు. చర్యలకు ఉపక్రమించేలోపే ఎన్నికల హడావిడి మొదలవ్వడంతో ఆచరణ సాధ్యం కాలేదు.

జగన్ ఉత్తుత్తి హడావుడి

పాదయాత్ర సందర్భంగా పూడిక తీయిస్తానంటూ హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చినా దీన్ని పట్టించుకోలేదు. తీరా ఎన్నికలు సమీపించాక గతేడాది నవంబరులో హడావుడి చేశారు. రూ.100 కోట్లతో సాగరమాల ప్రాజెక్టు ద్వారా పనులు చేయిస్తామంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రకటించారు. అదే నెల 21న సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. తుపాను వల్ల ఆయన పర్యటన రద్దయింది. వాస్తవానికి పనులకు సంబంధించి కేంద్రం నుంచి కొన్ని అనుమతులు వచ్చాయే తప్ప నిధుల కేటాయించలేదు. ఎన్నికల నేపథ్యంలో మత్స్యకారులను నమ్మించేందుకు ప్రయత్నించి అధికార పార్టీనేతలు భంగపడ్డారు.

ఎన్నికల ముందు హడావుడి

నాలుగున్నర సంవత్సరాల పాటు సమస్యను పట్టించుకోలేదు. మూడు నెలల ముందు శంకుస్థాపన అంటూ హడావుడి చేశారు. పనులు మాత్రం మొదలుకాలేదు. ఈ సారి కూడా జగన్ మాల ఎన్నికల హామీగానే మిగిలిపోయింది.

- సెల్వి సుధాకర్, మత్స్యకార నాయకుడు, భీములవారిపాళెం



సీన్ రివర్స్

శ్రీకాళహస్తి వర్తమానం

శ్రీకాళహస్తిలో ఈసారి సీన్ రివర్సవుతోంది. ఒకసారి ఓటమి సానుభూతి.. వైసీపీ వేవ్‌లో ఎమ్మెల్యేగా గెలుపొందిన మధుసూదన్‌రెడ్డికి ప్రస్తుతం ఎదురుగాలి వీస్తోంది. విపరీతమైన అవినీతి ఆరోపణలున్నాయి. నిత్య వివాదాస్పద నేతగా ముద్ర వేసుకున్నారు. ఎవరిపైనా రానంతగా భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ, కేసులు వంటి విమర్శలు ఆయనపై వచ్చాయి.

- శ్రీకాళహస్తి



- వైసీపీ ఎమ్మెల్యేపై విపరీతమైన అవినీతి ఆరోపణలు
- ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి
- ప్రభావత నేతల చేరికతో టీడీపీలో జోష్
- కలసివస్తున్న బీజేపీ, జనసేన మద్దతు

శ్రీకాళహస్తి వైసీపీ శ్రేణుల్లో అంతులేని అసంతృప్తి అలముకుంది. ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి వైఖరితో సొంత పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో భరించలేని అసహనం, అసంతృప్తి నెలకొంది. గుర్తింపు రాకపోవడం, పదవులు దక్కకపోవడం, పనులు జరగకపోవడం వంటి కారణాలతో అసంతృప్తి పేరుకుపోయింది. గ్రూపులు పెరిగిపోయాయి. వలస నేతలకు పెద్దపీట వేయడం వీరి అసంతృప్తికి మరింత ఆజ్యం పోసింది. ఎమ్మెల్యే కుటుంబం చుట్టూ కోటరీ ఏర్పడింది. కోటరీ నేతల అతిపెత్తనంతో ఆత్మాభిమానం దెబ్బతింటోందని పార్టీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు జడ్పీటీసీలు ఇలాంటి కారణంతోనే వైసీపీకి ఝలక్ ఇచ్చారు. ఈ అనూహ్య పరిణామంతో వైసీపీ చతికిలపడింది. గత ఎన్నికల్లో వైసీపీకి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య, నాయకులు లక్ష్మనేని మధు వంటి నేతలు పార్టీని వీడారు. వైసీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా వీరంతా పనిచేస్తున్నారు. మరోపక్క భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమాల్లో ఇక్కడి ఎమ్మెల్యే తీవ్రమైన అపప్రద మూటగట్టుకున్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడంతో వైసీపీలోని ఆశావాహులు భంగపడ్డారు. వార్డుల్లో చిన్నాచితకా నాయకులందరూ పార్టీకి దూరమయ్యారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి నియామకాల విషయంలోను మధు విఫలమయ్యారని సొంత పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. పట్టణంలో దాడులు పెరిగిపోయాయి. స్వపక్షంలోను దాడులకు తెగబడటం పార్టీ పరువును బజారుకీడ్చింది. ప్రశాంత శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో రౌడీయిజం పెరిగిందన్న ఆవేదన స్థానికుల్లో నెలకొంది. ఈనేపథ్యంలో ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కలసిరాక ఎమ్మెల్యే ఎదురీదుతున్నారు.

పోటెత్తిన వలసలు

సాధారణంగా ఎన్నికలకు ముందు వలసలు మామూలే. కానీ, శ్రీకాళహస్తిలో 14నెలల ముందే మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య టీడీపీలో చేరారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు గతేడాది జూలైలో భారీగా అనుచర వర్గంతో సొంత గూటికి చేరారు. ముగ్గురు జడ్పీటీసీలు, ఆతర్వాత కొందరు ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఇక పలువురు మాజీ కౌన్సిలర్లు వైసీపీని వీడారు. టీడీపీ బలం పుంజుకోవడంతో నెల రోజులుగా చేరికలు మరింత పెరిగాయి.



కూటమితో అదనపు బలం

ఎన్డీఏ కూటమితో టీడీపీ అభ్యర్థికి అదనపు బలం చేకూరింది. బలమైన ఓటు బ్యాంకు ఉన్న బలిజ సామాజిక వర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఆపార్టీ శ్రేణులు తోడయ్యారు. జనసేన నుంచీ నేతలు, శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

బలం పుంజుకున్న సుధీర్

టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి బాగా బలం పుంజుకున్నారు. అభివృద్ధి ప్రదాతగా, పాలనాదక్షుడిగా పేరొందిన గోపాలకృష్ణారెడ్డికి వారసుడు సుధీర్ గెలిస్తే మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొంటుందనే మాట ప్రజల్లో వినిపిస్తోంది. రెండేళ్ల కిందట గోపాలకృష్ణారెడ్డి కన్నుమూశారు. ఆయన కర్మక్రియల రోజునే సోదరుడు హరినాథరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. ఇద్దరు పెద్ద దిక్కులను కోల్పోయిన సుధీర్‌కు తల్లి బృందమ్మ, భార్య రిషితారెడ్డి వెన్నంటి నిలుస్తున్నారు. ఎన్నడూ గడప దాటని ఆ ఇద్దరూ బరువైన బాధ్యతలను భుజానికి ఎత్తుకున్నారు. నియోజకవర్గంలో ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ పలుమార్లు గడప గడపను చుట్టేశారు. ఇక, గతంలో సుధీర్ రెడ్డి మాట కటువు అన్నవారే నేడు ఆయన కలుపుగోలుతనం, అభివృద్ధి పనులపై మాట్లాడే విజన్, నిజాయితీతో కూడిన విధానాలను ప్రశంసిస్తున్నారు. కేడర్‌నూ ఆయన మృదువుగా పలకరిస్తూ కలుపుకొని వెళ్తున్నారు.

చెవిలో పువ్వు



చంద్రగిరి 50 పడకల ప్రభుత్వాస్పత్రి భవనం

చంద్రగిరిలో వంద పడకల ఆస్పత్రి

"పాలనా కేంద్రంగా చరిత్ర కలిగిన చంద్రగిరి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తా."

- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే

గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఈ హామీ ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదు. 1999-2004 నడుమ టీడీపీ ప్రభుత్వం ఇక్కడ వంద పడకల ఆస్పత్రికి తగిన భవనాలు నిర్మించింది. అయితే తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. అప్పటి ఎమ్మెల్యే గల్లా అరుణకుమారి 2006లో ఇదే భవనంలో 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వంలో ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతూ పులివర్తి నానీ జీవో తెప్పించారు. ఇప్పటికీ అదే స్థాయిలో ఆస్పత్రి నడుస్తోంది. గత ఎన్నికల్లో ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచుతానని హామీ ఇచ్చిన చెవిరెడ్డి ఈ ఐదేళ్లలో దాని గురించి పట్టించుకోలేదు. ప్రభుత్వంలో తనకున్న పలుకుబడితో తుడా ఛైర్మన్‌గా, ప్రభుత్వ విప్‌గా, టీటీడీలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పదవులకు మాత్రం జీవోలు తెప్పించుకున్నారు. అలాగే తన కుమారుడిని తుడా ఛైర్మన్‌గా నియమిస్తూ కూడా జీవో తెప్పించుకోగలిగారు. అదే సమయంలో పదిమందికీ పనికొచ్చే ఆస్పత్రి స్థాయి పెంపు విషయంలో జీవో తీసుకురాకుండా హామీ మరచిపోయారు.

గూడూరు చరిత్ర

ఉద్ధండుల పురిటిగడ్డ

అపార ఖనిజ సంపద,సుదీర్ఘ సముద్రతీరంతో గూడూరు నియోజకవర్గం విశిష్టతను సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో కీలకభూమిక పోషించిన ఉద్దండుల గడ్డ కూడా ఇది. మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు నాలుగు సార్లు విజయకేతనం ఎగురవేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పత్రా ప్రకాశ్‌రావు మూడు సార్లు విజయం సాధించారు. గూడూరు రాజకీయాలను శాసించిన నల్లపరెడ్డి, నేదురుమల్లి కుటుంబాలు కాలక్రమంలో నియోజకవర్గాన్ని ఎస్సీకి రిజర్వు చేయడంతో ఇతర స్థానాలకు వెళ్లారు.


నియోజకవర్గం ఆవిర్భవించింది : 1952
ఎన్నిసార్లు ఎన్నికలు జరిగాయి : 15

ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం :

1952-	పెల్లేటి గోపాలకృష్ణారెడ్డి	కాంగ్రెస్
1955	పెల్లేటి. గోపాలకృష్ణారెడ్డి	కాంగ్రెస్
1957	మేర్లపాక మునుస్వామి	కాంగ్రెస్
1962	మేర్లపాక మునుస్వామి	కాంగ్రెస్
1967	వేమారెడ్డి రామచంద్రారెడ్డి	ఇండిపెండెంట్
1972	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	ఇండిపెండెంట్
1978	పత్రా ప్రకాశరావు	కాంగ్రెస్
1983	జోగి మస్తానయ్య	తెలుగుదేశం
1985	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
1989	పత్రా ప్రకాశ్‌రావు	కాంగ్రెస్
1994	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
1999	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
2004	పత్రా ప్రకాశ్‌రావు	కాంగ్రెస్
2009	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
2014	పాశిం సునీల్‌కుమార్	వైసీపీ
2019	వెలగపల్లి వరప్రసాద్‌రావు	వైసీపీ

మండలాలు: గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు

మున్సిపాలిటీ : గూడూరు



ఓటర్ల సంఖ్య: 2,43,624
పురుషులు: 1,18,435
స్త్రీలు: 1,25,155
ఇతరులు: 34

- గూడూరు అర్బన్

జన చైతన్యం



ఇదీ సందడి



అంటే... ఆయప్ప మొనగోడు కాదా!!

'అయితే ఆయప్ప మొనగోడు కాదా..' అనేసి డౌట్ కొట్టింది అక్కడున్నోల్లందరికీ. చెప్పిందంతా ఇన్నాక మీగ్గూడా అదే డౌట్ కొడితే తప్పు మీది, నాదీ కాదు. అసలు కతేందంటే.. ఆ మజ్జన మంత్రి పెద్దిరెడ్డి ఎకాఎకిన కుప్పం వొచ్చీరావటంతోనే మీటింగు పెట్టేసినాడు ఒకిద్దరు నాయకులు మాటలతో ఊదరగొట్టేసినాక, ఆయప్ప పైకిలేచి నిలబడినాడు. మైకు చేతిలోకి తీసుకోని కుడిఎడమల్లో కూకోనుండిన ఎమ్మెల్సీ భరత్‌ను, రెస్కో ఛైర్మన్ సెందిల్‌ను తలకాయ ఈపక్కా ఆపక్కా తిప్పి చూసినాడు. గొంతు సవరించుకోని చంద్రబాబు పాలన ఎంత అసింకమో చెప్పినాడు. మాటల మజ్జలో మల్లీ మంత్రిగారు ఒకపారి భరత్‌ను, సెందిల్‌ను సూసి వోల్లిద్దరినీ దెగ్గిరికి పిల్సినాడు. సెందిల్ బుజంమింద చెయ్యేసి ప్రేమగా నిమిరినాడు. 'ఇదిగోప్పా సెందిలా, బారమంతా నీమీదనే పెడ్తావుండా. మన భరత్‌ను నువ్వే గెలిపించుకోవల్లప్పా..' అనేసినాడు. ఆడితో ఊరుకుండ్లా. సెందిల్ సేతిని తీసి, భరత్ సేతిలో పెట్టి 'ఈల్లిద్దురూ ఫ్రెండ్స్. నాకు తెలును, మన భరత్ సెంద్రబాబుమింద గెలస్తావుండాడు.' అని ఆయప్పకు ఆయప్పే దైర్నం చెప్పేసుకున్నాడు. 'ఇదేందప్పా ఈ పెద్దాదయన..? సెందిల్ గెలిపించాల అని చెప్తాడు. అయితే భరతన్న మొనగోడు గాదా..' అనే డౌటు ఆ మీటింగులో ఉన్న శానామందికే వొచ్చింది కానీ, పెద్దిరెడ్డిని అడిగేటంతటోల్లు ఎవురుండారు జెప్పండి. కొసమెరుపేందంటే.. 'న్నో.. నాకు అరవయ్యో, డెబ్బయ్యో బూతులిచ్చిండారు. మీరు జెప్తావున్నట్టు మెజారిటీలు తెచ్చేకి లేదు. టీడీపీతో ఈక్వల్ చేసేకి మాత్రం జూస్తా' అనేసి ఇదే సెందిల్ పెద్దిరెడ్డితో మూడ్నాలుగు రోజుల కిందట తెగేసి చెప్పేసినాడని అంతా అనుకుంటా ఉండారు.

- కుప్పం

మీ ఓటు సీఎంకే!

కుప్పంలో టీడీపీ శ్రేణుల వినూత్న ప్రచారం



ఆయప్పకు ఓటేస్తే సీఎం అవుతాడు ...ఈయప్పకు ఓటేస్తే లాభమేమి అన్న చర్చ కుప్పం నియోజకవర్గంలో విస్తృతమౌతోంది. సీఎం అయ్యే అయప్పకు ఓటేస్తే మన ఊర్లు బాగుపడతాయి, మన చిన్నోళ్లకు ఉద్యోగాలు, పనులు దొరుకుతాయి, ఓడిపోయే వ్యక్తికి ఓటు వేస్తే కదా అన్న వాదనలు కూడా బలంగా విన్పిస్తున్నాయి. కుప్పం నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు లక్ష మెజారిటీ లక్ష్యంగా టీడీపీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఓటర్లు తమ ఓటుహక్కు నియోజకవర్గ అభివృద్ధికే కాకుండా, రాష్ట్ర అభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని వారు ఓటర్లుకు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతకు తోడు, టీడీపీకి జనసేన, బీజేపీ తోడవడంతో రాష్ట్రంలో తిరిగి టీడీపీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఖచ్చితంగా ఏర్పడుతుందని వారు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని వారు ఓటర్లుకు పదేపదే గుర్తు చేస్తున్నారు. చంద్రబాబుపై కుప్పం నియోజకవర్గంలో గత ఏడుసార్లు ఎవరూ గెలవలేకపోయారని, రానున్న ఎన్నికల్లో సైతం చంద్రబాబు విజయాన్ని ఏ శక్తి అడ్డుకోజాలదని వారు చెబుతున్నారు. మళ్ళీ మరోసారి సీఎం అయ్యే చంద్రబాబుకు ఓటు వేయాలని కోరుతున్నారు. వైసీపీ వాళ్లేమో కుప్పంలో భరత్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తానని జగన్ చెప్పిన మాటను ప్రచారం చేస్తున్నారు. అధికారంలోకి రాని పార్టీలో మంత్రి ఎట్లవతాడంటూ టీడీపీ వాళ్లు తిరగ్గొడుతున్నారు. పైగా కుప్పం నియోజకవర్గంపై జగన్‌కి అంత ప్రేమే ఉంటే భరత్ ఎమ్మెల్సీగా ఎన్నికైన వెంటనే మంత్రిని చేసి ఉండవచ్చు కదా అని ప్రశ్నలు సంధిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని టీకొట్లు, రచ్చబండల మీద ఇవే మాటలు వినిపిస్తున్నాయి.

- రామకుప్పం

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు

నోట్ దిస్ పాయింట్

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునేందుకు కల్పించిన అవకాశాన్ని 22వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పొడిగించినట్లు చిత్తూరు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు.ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందికి జిల్లాలో ఓటు హక్కుంటే వినియోగించుకునేందుకు ఫారం-12 పూరించి,మంగళవారం లోగా ఆయా శాఖల హెచ్‌వోడీలకు అందజేయా లన్నారు. ఇతర జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది చిత్తూరు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నట్లయితే అట్టివారు ఫారం-12, అనెగ్జర్ 12(ఇ)ని హెచ్‌ఓడీల ద్వారా కలెక్టర్‌కు సమర్పించాలని తెలిపారు.గడువులోగా ఫారాలు అందించకుంటే వారు సొంత నియోజకవర్గాలకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాల్సి ఉంటుందని వివరించారు. అటువంటి వారికి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే వెసులుబాటు ఉండదని తెలిపారు.

- చిత్తూరు కలెక్టరేట్


ఓం శక్తికి నమస్కరించి.. నామినేషన్ సమర్పించి..



● సెంటిమెంట్

పలమనేరులో ఎన్నికల బరిలో నిలిచే వార్డు సభ్యుడి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి వరకూ నామినేషన్ సందర్భంలో ఓ సెంటిమెంట్‌ను కచ్చితంగా అనుసరిస్తారు. పలమనేరు ఈశాన్యంలోని ఎద్దుల చెరువు దగ్గరున్న ఓం శక్తి ఆలయం వద్ద పూజ చేశాకే నామినేషను వేయడానికి బయలుదేరుతారు. నేరుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ సమర్పిస్తారు. ఈ ఎన్నికల్లో ఇప్పటికే వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే వెంకటేగౌడ ఈ సంప్రదాయాన్ని పాటించారు. అలాగే, సోమవారం టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డి నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన కూడా ఆలయంలో పూజలు చేసి.. అక్కడ్నుంచి ఆర్వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ సమర్పించనున్నారు.

- పలమనేరు



పరిమితికి మించి తవ్వుకో.. ఇష్టమొచ్చిన రేటుకు అమ్ముకో.. ఎక్కడికైనా తరలించుకో.. ఇలా జిల్లాలో ఐదేళ్లుగా ఇసుక దోపిడీ సాగింది. అధికార పార్టీ అండతో నిబంధనలకు పాతరేసి నదులను బావుల్లా తవ్వేశారు. నీవా నదిలో రైతుల బావులు, బోర్లు, పైపులైన్లు పెరికేసి మరీ ఇసుక తవ్వేస్తున్నారు. పక్క రాష్ట్రాలకే ఎక్కువగా తరలిస్తున్నారు. స్థానికంగా అందుబాటులో తక్కువ. ఉన్నా అమితమైన రేటు. దీని ప్రభావం పేదల ఇళ్లపై పడింది. ఇసుక భారం వల్లే చాలాచోట్ల ప్రభుత్వ ఇళ్లు కట్టుకోలేక పేదలు ఇబ్బంది పడుతున్నారు.

టీడీపీ హయాంలో ఇసుక ఉచితం. రవాణా చార్జీలు మాత్రమే ఇళ్ల నిర్మాణదారులు భరించాలి. వైసీపీ వచ్చేసరికి పేదలకు ఇసుక భారం కావడంపై ప్రత్యేక కథనం. - చిత్తూరు రూరల్

తవ్వుకో.. అమ్ముకో

● ఐదేళ్లూ ఇసుక దోపిడీ

ట్రాక్టరు ఇసుక రూ.5 వేలపైనే

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశారు. స్థానికుల అవసరానికి ట్రాక్టరు ఇసుక రవాణా ఛార్జీలతో కలిపి రూ.వెయ్యి నుంచి రూ.1500కు వచ్చేది.

● వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఉచిత విధానానికి మంగళం పాడారు. ఇప్పుడు ట్రాక్టరు ఇసుక రూ.5 వేలకు పైగా ఉంటోంది. నిరుపేదలు చిన్న గది నిర్మించుకోవాలన్నా ఇసుక కొనలేని పరిస్థితి.



నీవా నదిలో ఇసుక లేకుండా తోడేశారిలా..

శ్మశానాన్నీ వదల్లేదు



అనంతాపురం రీచ్.. నీవా నది ఒడ్డున స్థలాన్ని స్థానికులు శ్మశాన వాటికగా వాడుతున్నారు. ఈ శ్మశాన స్థలాన్నీ తవ్వేశారు. ఈ తవ్వకాల్లో అస్థిపంజరాలు, ఎముకలు బయట పడుతుండటంపై స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

యంత్రాలతో తవ్వేస్తూ..

టీడీపీ హయాంలో ఇసుక రీచుల్లోకి యంత్రాలకు అనుమతి లేదు. కూలీల ద్వారానే తవ్వుకోవాలి. తద్వారా ఒక్కో కూలీకి రోజుకు రూ.వెయ్యి వరకు కూలీ లభించేది. ఎవరైనా ట్రాక్టర్ల ద్వారానే ఇసుక తీసుకెళ్లాలి. టిప్పర్లకు అనుమతి లేదు. దీనివల్ల ఇసుకను అవసరానికి మించి అపరిమితంగా తవ్వి తరలించే వీలు ఉండేది కాదు.

- వైసీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి మారిపోయింది. ఎక్స్‌కవేటర్లు, హిటాచీలతో బావుల్లా తవ్వేస్తున్నారు. ఇసుక రీచుల్లో ట్రాక్టర్ల కన్నా టిప్పర్లే ఎక్కువ కనిపిస్తున్నాయి.



రీచ్‌లో టిప్పర్లతో ఇసుక తరలింపు



బావిని తలపిస్తున్న అనంతాపురం రీచ్

నిబంధనలకు పాతర

సాధారణంగా ఇసుక రీచుల్లో రెండు నుంచి మూడు మీటర్ల మేరకే తవ్వుకునేందుకు అనుమతిస్తారు. అంతకుమించి తవ్వకూడదు.

- వైసీపీ ప్రభుత్వంలో మాత్రం రాష్ట్రంలో ఇసుక అమ్మకాలను కేటాయించిన సంస్థకు.. ఎంత లోతు వరకు తవ్వాలనే అంశంపై ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. దీనిని అడ్డం పెట్టుకుని యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరు, అనంతాపురం రీచుల్లో 20 అడుగులకుపైనే ఇసుక తవ్వేశారు. దీనిపై చుట్టు పక్కల గ్రామస్తులు, రైతులు ఫిర్యాదులు చేసినా.. అధికార పార్టీ అండ ఉండటంతో అధికారులు పట్టించుకోలేదు.

జగనన్న ఇళ్లకు ఉచిత ఇసుకేదీ?

జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకునే వారికి ఉచితంగా ఇసుక అందించాలి. దీనికోసం అధికారులు ఇచ్చే పర్మిట్లు తీసుకుని వెళితే ఇసుక ఇవ్వడం లేదు. నిల్వ లేదంటూ పంపేస్తున్నారు. వైసీపీ నాయకులు మాత్రం నిత్యం వందలాది టిప్పర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సకాలంలో ఇసుక దొరక్క లబ్ధిదారులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఎక్కువ డబ్బు చెల్లించి ఇసుక తెచ్చుకుంటున్నారు.

తమిళనాడులో నిషేధం

పర్యావరణ పరిరక్షణ.. భూగర్భ జలాలను కాపాడుకునేందుకు తమిళనాడులో ఇసుక తవ్వకాలపై నిషేధం విధించారు. కర్ణాటకలో ఇసుక లభ్యత తక్కువ. దీంతో ఆ రెండు రాష్ట్రాల్లో ఇసుకకు డిమాండు ఎక్కువ. దీనిని అధికార పార్టీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. ఒక పెద్ద టిప్పర్ ఇసుక ధర తమిళనాడు, కర్ణాటకకు తీసుకెళ్తే రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది. దీంతో స్థానిక ప్రాంతాల్లో ఇసుక అందించేందుకు వారు సుముఖత చూపడం లేదు. రాత్రికి రాత్రే ఇసుకను సరిహద్దులు దాటించేస్తున్నారు. అధికారపార్టీ అండదండలు ఉండటంతో పోలీసులూ పట్టించుకోవడంలేదు. ఇసుక దొరక్క స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

రైతులపైనే కేసులు పెడతామని బెదిరింపు

చిత్తూరు మండలం అనంతాపురం రీచ్‌లో ఇష్టానుసారంగా ఇసుక తవ్వేస్తున్నారని, భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని గతేడాది రైతులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. రైతులపైనే కేసులు పెడతామని బెదిరింపులకు దిగారు. భారీ వాహనాల్లో ఇసుక తరలిస్తుండటంతో గ్రామీణ రోడ్లు పాడైపోయాయని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక కొనుక్కోలేక..!



టీడీపీ ప్రభుత్వంలో ఇల్లు మంజూరైంది. కడగాలు వరకు వేశాను. అంతలో ఎన్నికలు వచ్చి వైసీపీ అధికారంలోకి వచ్చింది. గోడలు ఎక్కించాను. బిల్లు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులను అడిగితే టీడీపీలో మంజూరైంది కదా.. బిల్లు కూడా టీడీపీ అధికారంలోకి వచ్చాకే తీసుకో అని చెప్పారు. అప్పు చేసి పూతపనైనా చెద్దామనుకుంటే ట్రాక్టరు ఇసుక రూ.3500 అంటున్నారు. అంత డబ్బులు పెట్టి ఇసుక కొనలేక, మొండి గోడలతో పనులు ఆపేశాను.

- సుధీర్, అనంతాపురం

కడగాలుతోనే ఆపేశా



ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసినా ఇసుక ధరల వల్ల పునాది వేసి ఆపేశాను. టీడీపీ ప్రభుత్వంలో రూ.800 ఇస్తే ట్రాక్టర్ ఇసుక వచ్చేది. ఇప్పుడు రూ.3500 అడుగుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఇసుకకే సరిపోయేలా ఉంది. దీంతో ఏం చేయాలో తెలియక కడగాలుతోనే నిర్మాణ పనులు నిలిపేశాం.

- వేలుమురుగన్, కుర్చివేడు కాలనీ

సేవా దృక్పథమున్న నాయకుడిని అభ్యర్థిగా ఖరారు చేయడంతో చిత్తూరు టీడీపీ పుంజుకుంది. నియోజకవర్గంలో సీనియర్ నాయకుల చేరికతో పార్టీ బలోపేతమైంది. జనసేన, బీజేపీల పొత్తు శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఫుల్ జోష్‌తో గెలుపుపై గురిపెట్టింది. అదే సమయంలో వైసీపీ శిబిరంలో విజయంపై ధీమా సడలింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

గెలుపుపై 'గురజాల' గురి

● ట్రస్ట్ సేవలతో కూడగట్టుకుంటున్న ప్రజాదరణ ● అందరినీ కలుపుకొంటూ వడివడిగా ప్రచారం
● నేరచరిత్ర విజయానందరెడ్డికి ప్రతికూలం ● డీలా పడిన వైసీపీ శిబిరం

చిత్తూరు వర్తమానం

గురజాల దూకుడు



గుడిపాల మండలానికి చెందిన గురజాల జగన్మోహన్ బెంగళూరులో రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడ్డారు. ఏడాది కిందట చిత్తూరుకు తిరిగి వచ్చి జీజేఎం ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటారనే పేరు సంపాదించారు. ఇది ఆయనకు ప్రధానమైన సానుకూలాంశం. చంద్రబాబు, లోకేశ్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పే ఆయన పార్టీలో పదవిని ఆశించకుండా పని చేస్తూ వచ్చారు. ఆరుగురు నేతలు టీముగా ఏర్పడి, తమలో ఎవరికి టికెట్ వచ్చినా కలసి పనిచేస్తామనే ఒప్పందంతో ప్రచారంలోకి దిగారు. సేవా కార్యక్రమాలకు గుర్తించి టీడీపీ అధిష్ఠానం గురజాలకు టికెట్ ఇచ్చింది. టికెట్ వచ్చాక నియోజకవర్గంలోని నాయకులందరినీ కలుపుకొన్నారు. సానుకూల వైఖరి, మాటతీరుతో ఆకట్టుకుంటున్నారు. అభ్యర్థిపరంగా అనుకూలతలు పార్టీ కేడర్‌ను ఉత్సాహంగా పనిచేసేలా చేస్తున్నాయి. ఈసారి చిత్తూరులో టీడీపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా వీరంతా ముందుకు కదులుతున్నారు. ఒకప్పుడు నియోజకవర్గంలో తమ ముద్ర వేసిన సీనియర్ నాయకులంతా పార్టీ విజయానికి చొరవ చూపుతున్నారు. ఇప్పటికే దొరబాబు, చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరి బాలాజీ, గుడిపాల బాలాజీ, వసంత్‌కుమార్, ఆయా మండలాల అధ్యక్షులు పార్టీ గెలుపు కోసం పనిచేస్తున్నారు. గురజాలను అభ్యర్థిగా ప్రకటించాక మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, ఏఎస్ మనోహర్.. కూటమిలో భాగంగా జనసేన నుంచి ఆరణి శ్రీనివాసులు వర్గం, బీజేపీ నుంచి మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌పీ వెంకటేశ్వర చౌదరి తదితరులు టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నారు.

తెరపైకి విజయానందరెడ్డి నేరచరిత్ర



జీడీనెల్లూరు నియోజకవర్గం ఎస్‌ఆర్‌పురం మండలానికి చెందిన వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి ఎర్రచందనం స్మగ్లర్‌గానే చిత్తూరు ప్రజలకు పరిచయం. ఇటీవల దాఖలు చేసిన నామినేషన్ అఫిడవిట్ లోనూ తనపై 12 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు, ఓ మద్యం అక్రమ రవాణా కేసు ఉన్నట్లు ఆయనే ప్రకటించడం విశేషం. 2014లో ఆయన పీలేరు సబ్‌జైలుతో పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా గెలిచినా, ఆయనకు వ్యతిరేకంగా ఉంటూ.. పవర్ సెంటర్‌గా మారారు. ఈసారి టికెట్ కోసం ముందు నుంచే ప్రణాళికలు రచించారు. దీని కోసం ప్రజాకర్షక కార్యక్రమాలు చేపట్టినా.. అదంతా అక్రమ సంపాదనే కదా అని చిత్తూరు ప్రజలు భావిస్తున్నారు. విజయానందరెడ్డికి టికెట్ వచ్చాక సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి జనసేనలో చేరారు. మరికొందరు ప్రధాన నేతలు వైసీపీలోనే ఉన్నా.. ఆ పార్టీ విజయానికి చిత్తశుద్ధితో కృషి చేయడం లేదంటున్నారు. చాలామంది వైసీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆయన అభ్యర్థిత్వాన్ని అంగీకరించకలేక పోతున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

చల్లా కుటుంబంలో ముచ్చటగా మూడోతరం



సీకే నారాయణరెడ్డి



ప్రభాకర్‌రెడ్డి



రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 21: తన కుటుంబంలో మూడో తరం తరఫున పోటీకి సిద్ధమయ్యారు చల్లా రామచంద్రారెడ్డి. తాత, తండ్రి తరహాలో తానూ చట్టసభకు ఎన్నికై వారసత్వం సత్తా చాటాలని కృతనిశ్చయంతో ఉన్నారు. 1962లో రొంపిచెర్లకు చెందిన సీకే.నారాయణరెడ్డి (చల్లాబాబు తాత) పీలేరు నుంచి సీపీఐ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.ఆ తర్వాత ఆయన కుమారుడు ప్రభాకర్‌రెడ్డి 1983, 1985 ఎన్నికల్లో టీడీపీ తరఫున రెండు సార్లు పీలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రభాకర్ రెడ్డి మృతితో ఆయన కుమారుడు రామచంద్రారెడ్డి 1989లో పీలేరు టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతిలో ఓటమి చెందారు. తర్వాత పీలేరు టీడీపీ పగ్గాలు జీవీ శ్రీనాథరెడ్డికి దక్కడంతో చల్లాబాబు కుటుంబం రొంపిచెర్ల రాజకీయాలకే పరిమితమైంది. ఎంపీపీ, టీటీడీ సభ్యుడు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్‌గా, ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేసిన రామచంద్రారెడ్డి, రెండేళ్ల క్రితం పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. నియోజకవర్గాల పునర్విభజనతో రొంపిచెర్ల పుంగనూరు పరిధిలోకి వచ్చింది. ప్రస్తుత ఎన్నికల్లో పుంగనూరు నుంచి పోటీచేసే అవకాశం ఆయనకు వచ్చింది. పూర్వపు ప్రత్యర్థి పెద్దిరెడ్డిపైనే తలపడుతున్నారు. తాత, తండ్రి తరహాలో తానూ గెలుపొంది మూడోతరం రాజకీయ వారసత్వం నిలబెట్టాలని బాబు ఉత్సాహంగా ఉన్నారు.

కరకంబాడిలో వైసీపీ నాయకుల దౌర్జన్యం

సీఐ సహకారంతో నా స్థలాన్ని కబ్జా చేశారు

మీడియా ఎదుట బాధితుడి ఆవేదన


మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రనాథ్

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21: కరకంబాడిలో వైసీపీ నాయకులు దౌర్జన్యం చేయడంతో పాటు తన స్థలాన్ని కబ్జా చేశారని సురేంద్రనాథ్ మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరాలు తెలిపారు. ఆయన మాటల్లోనే.. 'రేణిగుంట మండలం కరకంబాడి గ్రామ లెక్క దాఖలాలోని సర్వే నెంబర్లు 170-3ఎ1, 170-3ఎ2లో 13.5 సెంట్ల భూమిని గత ఏడాది ఫిబ్రవరి 16న పోలిశెట్టి విశ్వనాథం కుటుంబీకుల నుంచి మా కుటుంబం కొనుగోలు చేసింది. అప్పటి నుంచి మా వెనుక స్థలం కల్గిన వారికి అమ్మేయాలని వైసీపీ నాయకులు లింగం రమేష్, బాబురావు, టి.వెంకటరత్నం, బాలాజీ, ఎస్.రమేష్‌లు వారి అనుచరులతో బెదిరిస్తూ వస్తున్నారు. అయినా మా స్థలంలో దుకాణాలు కట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నాం. ఆ తర్వాత కూడా మా స్థలాన్ని కబ్జా చేయాలని చూడటంతో గత ఏడాది మార్చిలోనే ఎస్పీకి ఫిర్యాదు చేశాం. అయినా పోలీసులనుంచి న్యాయం జరగలేదు. మరోవైపు ఈనెల 17వ తేదీ రాత్రి సమయంలో దుకాణం వద్ద నాపరాళ్లు అన్‌లోడ్ చేస్తుండగా సీఐ మల్లికార్జున వచ్చి నా కుమారుడు, అన్నను కొట్టి జీపులో ఎక్కించుకెళ్లిపోయారు. మరుసటి రోజున స్టేషన్‌కి వెళితే దుర్భాషలాడి, మాపైనే తప్పుడు కేసు పెట్టి, విడిచిపెట్టారు. దీనిపై అదే రోజు సాయంత్రం ఎస్పీకి ఫిర్యాదు చేశాం. ఎస్పీకి ఫిర్యాదు చేస్తావా.. అని వైసీపీ నాయకులు శనివారం ఉదయం మా దుకాణాల వద్దకొచ్చి లోపలున్న రూ.14లక్షల విలువైన సిమెంట్, రేకులు, ఇటుక రాళ్లు, కడప నాపరాళ్లను ఎత్తి రోడ్డున పడేశారు. మరోసారి ఈ స్థలంవద్ద కొస్తే చంపుతామని బెదిరించారు. సీఐ సహకారంతోనే ఇదంతా చేస్తున్నారు' అని సురేంద్రనాథ్ వివరించారు. ఈ సమావేశంలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ నాయకుడు రెడ్డి శేఖర్ రాయల్, బాధితుడి కుటుంబీకులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచార వాహనంపై కేసు నమోదు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21: నెంబర్ ప్లేట్ లేకుండా... ప్రచారం చేస్తున్న వైసీపీ వాహనంపై కేసు నమోదు చేశారు. పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయం సమీపంలో వైసీపీ జెండాలు ఫొటోలు, కటౌట్లతో ఓ వాహనం ప్రచారం చేస్తుండగా స్థానికులు సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సభ్యురాలు సెల్వ కుమారి స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాన్ని అడ్డుకోబోయారు. ఇది గమనించిన డ్రైవర్ అతివేగంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సెల్వ కుమారి ఫిర్యాదు మేరకు... వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పెయింటింగ్ పనులు చేసే ఓ యువకుడి వాహనంగా అధికారులు గుర్తించారు.

ముక్కంటి సేవలో రష్యన్లు


ముక్కంటి ఆలయంలో రష్యన్లు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఆదివారం నలుగురు రష్యా భక్తులు దర్శించుకున్నారు. ముందుగా ఆలయంలో రాహు కేతు సర్ప దోష నివారణ పూజలను జరిపించుకున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ మైమరచిపోయారు. ఆలయం మూడవ ద్వారం సమీపంలో ఉన్న చతుర్ముఖ సూర్య నారాయణమూర్తి సన్నిధి వద్ద భక్తి తన్మయత్వంతో శివనామస్మరణ చేశారు.

కల్కి ఆక్రమించిన భూములను తక్షణం రైతులకు స్వాధీనం చేయాలి


మీడియా సమావేశంలో వెంకటసుబ్బయ్య

వరదయ్యపాళెం, ఏప్రిల్ 21: కల్కి ఆశ్రమ నిర్వాహకులు ఆక్రమించిన భూములను తక్షణమే రైతులకు స్వాధీనం చేయాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండు చేశారు. వరదయ్యపాళెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు 16 సంవత్సరాల క్రితం చెదుళ్లపాకం గ్రామానికి చెందిన 3.74ఎకరాల పేద రైతుల సీలింగ్ భూమిని కల్కి అలియాస్ విజయకుమార్ ఆక్రమించి ఆశ్రమం నిర్మించాడన్నారు. రెవెన్యూ అధికారులు కూడా అతడికే కొమ్ము కాశారన్నారు. ఈ విషయంపై హైకోర్టుకెళితే జనవరి 10న రైతులకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. అయితే అధికారులు కాలయాపన చేసి తిరిగి కల్కికే ఆ భూమిని ధారాదత్తం చేయాలని చూస్తున్నారన్నారు. తక్షణం అధికారులు స్పందించి ఆ భూమిని రైతులకు అప్పజెప్పాలన్నారు. లేనిపక్షంలో కోర్టు ధిక్కరణ కేసును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హేతువాద సంఘం నాయకులు రాజు, వెంకటరమణ, రైతులు చంద్రశేఖర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బలిజల అభ్యున్నతి



తొట్టంబేడు, ఏప్రిల్ 21: టీడీపీతోనే బలిజల అభ్యున్నతి సాధ్యమని టీవీ సీరియల్ ప్రొడ్యూసర్ పల్లమాల సుధాకర్ అన్నారు. తిరుపతిలోని బలిజ సేవా సమితి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, ఎమెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

నగదు, మద్యం రవాణాపై నిఘా ఉంచండి: కలెక్టర్


దాసుకుప్పంలో ఈవీఎం స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్

సత్యవేడు, ఏప్రిల్ 21: నగదు, మద్యం రవాణా కాకుండా రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల్లో నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు వీడియో రికార్డింగ్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం ఆయన సత్యవేడు మండలంలోని దాసుకుప్పం పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దాసుకుప్పంలోని ఆదర్శ పాఠశాలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావుకు సూచించారు. తరువాత సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి ఇచ్చే ఎన్నికల సామగ్రి, కంపార్ట్‌మెంట్ యూనిట్ తదితర సామగ్రిని పరిశీలించారు. ఈవీఎం సెకండ్ ర్యాండమైజేషన్‌ను సెక్టార్ వారీ ఏర్పాటుతో, బందోబస్తు నడుమ చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పక్కనే ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. అనంతరం సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌ను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి నరసింహులు, తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులు, బీఎల్వోలుపాల్గొన్నారు.

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లె చెక్‌పోస్టును కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తనిఖీ చేశారు. సిబ్బందికి అందుబాటులో ఉన్న సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. పక్కరాష్ట్రం నుంచి జిల్లాలోకి ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో బాబు, ఎస్ఐ ఓబయ్య, డీటీ వెంకట సుబ్బయ్య, వీఆర్వో నాగభూషణం పాల్గొన్నారు.

పిచ్చాటూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఆర్వో నరసింహులు, తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాటు జరగకూడదని స్పష్టం చేశారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఎన్నికలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లపై నిఘా ఉంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ వెంకటేశ్వర్లుకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్‌వో సంజీవరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, డీటీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి: బృందమ్మ


బృందమ్మను సన్మానిస్తున్న బీసీలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఉడవలపాడులో ఆదివారం బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల పక్షపాతిగా గెలిచిందన్నారు. బలహీన వర్గాల అభివృద్ధి కోసం టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా గ్రామాలకు ఎన్నో వసతులను కల్పించాలన్నారు. ముఖ్యంగా బీసీల అభ్యున్నతి కోసం గ్రామీణ ప్రజలకు విద్యను చేరువ చేసిన ఘనత చంద్రబాబుకి దక్కిందన్నారు. బడుగు బలహీన వర్గాల్లో బాలికలు అందరూ చదువుకోవాలన్న ధ్యేయంతో ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. అలాగే విదేశీ విద్య అందించారని వివరించారు. చేతి వృత్తులకు చేయూతనిస్తూ చంద్రబాబు పనిముట్లతో ఆసరాగా నిలబడ్డారన్నారు. అన్ని విధాల బీసీల అభివృద్ధి కోసం టీడీపీ ఆది నుంచి అండగా నిలుస్తోందన్నారు. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలపై విపరీతంగా దాడులు పెరిగిపోవడం దుర్మార్గమన్నారు. బీసీల అభివృద్ధిని పూర్తిగా విస్మరించడమే కాకుండా అడుగడుగునా దాడులతో అభద్రతా వాతావరణం సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో చేతివృత్తిదారులకు కనీస ప్రోత్సాహకాలు లేక అప్పుల పాలయ్యారన్నారు. అన్ని విధాలా అవస్థలు పడుతున్న బీసీ ప్రజలను ఆదుకోవాలని ఆలోచనతో చంద్రబాబు నాయుడు డిక్లరేషన్ ప్రకటించడం హర్షణీయం అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత బీసీల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తారని వివరించారు. బీసీల గర్జనతో అరాచక వైసీపీ అంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

50వేల మెజారిటీతో గెలుస్తా: సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21: 50 వేల భారీ మెజారిటీతో గెలుస్తానని శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. విజయవాడలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆదివారం బీఫాం అందుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... శ్రీకాళహస్తి అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.



చంద్రబాబు నుంచి బీఫాం అందుకుంటున్న సుధీర్‌రెడ్డి

అందుబాటులో ఉంటూ... అభివృద్ధి చేస్తా: వరప్రసాద్



బలిజ ఆత్మీయ సమావేశంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో వరప్రసాదరావు - జగ్జీవన్‌రాం పార్కులో ఓట్లు అభ్యర్థిస్తూ...

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) ఏప్రిల్ 21 : నిత్యం అందుబాటులో ఉంటూ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని గత పదవీకాలంలో సైతం అభివృద్ధి చేశానని బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. ఆదివారం తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పార్కు, జగ్జీవన్‌రాం పార్కులో ఆయన వాకర్లను కలుసుకొని ఓట్లను అభ్యర్థించారు. తన హాయంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మళ్లీ అభివృద్ధి చెందాలంటే అది బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితోనే సాధ్యమని ఆయన చెప్పారు. అనంతరం తిరుపతి నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన బలిజ ఆత్మీయ సమావేశంలో ఆయన తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు జనం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దళితులంటే జగన్‌కు చులకన భావమని చెప్పారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధి కన్నా విధ్వంసమే ఎక్కువగా జరిగిందని దీనిని సహించలేకే తాను ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానని చెప్పారు. ప్రస్తుతం తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధి కేంద్రప్రభుత్వ చొరవే అన్నారు. స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులన్నీ పక్కదారి పట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్య పనులకు సైతం నిధులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వమే మరోసారి పంచాయతీలకు నిధులను కేటాయించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ నాయకులు యుగంధర్, దామోదర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం అందజేత

ఏర్పేడు, ఏప్రిల్ 21: మండలంలోని అముడూరు పంచాయతీ పరమాలపల్లెకు చెందిన కవిత తన భర్త వేధింపులు తట్టుకోలేక శనివారం రాత్రి రైలు కింద పడి మృతి చెందిన విషయం తెలిసిందే. కవిత మృతదేహానికి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పజెప్పారు.

బావిలో పడి బాలుడి మృతి

తొట్టంబేడు, ఏప్రిల్ 21: చిట్టత్తూరు గ్రామానికి చెందిన హరికృష్ణ కుమారుడు తరుణ్‌సాయితేజ(15) ఆదివారం తమ వ్యవసాయ పొలంలోకి వెళ్లాడు. ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బావిలో పడి మృతి చెందాడు. ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

నేసనూరుగట్టులో వైద్య శిబిరం

పుత్తూరు, ఏప్రిల్ 21: పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేసనూరుగట్టు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు శ్రీనివాసులు రెడ్డి, శ్రీధర్‌రాజు, సుభాషిణి రోగులకు పరీక్షలను చేసి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరం నిర్వహణకు గ్రామస్థులు మోహన్‌రావు, శివకుమార్, కేకేసీ హోమియో వైద్య కళాశాల సిబ్బంది సహకారం అందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కుప్పయ్యశెట్టి, మాధవ నాయుడు, సుబ్బులురాజు, రంగరాజు, ద్వారకనాథశెట్టి, గోపిరాయల్, శివశంకర్ నాయుడు, రఘునాధరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వడమాలపేట, ఏప్రిల్ 21: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఉత్సవ మూర్తులకు అభిషేకం చేసి పట్టుపీతాంబరాలు, పూలమాలాలతో సుందరంగా అలంకరించారు. వేద పండితులు రఘునాధ శర్మ, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మేళతాళాల నడుమ మాంగళ్యధారణ చేయించారు.

కమనీయం అగస్తీశ్వరుడి కల్యాణం

నారాయణవనం, ఏప్రిల్ 21: మండలంలోని సముదాయంలో గ్రామంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్తీశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం విశేష పూజల అనంతరం మరగదవల్లీ సమేత స్వామివారిని సుందరంగా అలంకరించి కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. అర్చకుల వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించారు.

ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తా: భానుప్రకాష్



చంద్రబాబు నుంచి బీఫాం అందుకుంటున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 21: నగరి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా భానుప్రకాష్ బీఫాంను అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక, అవినీతి పాలనతో విసిగిపోయిన నియోజకవర్గ ప్రజలు వైసీపీని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజల్లో విశేష స్పందన వస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదని తేల్చి చెప్పారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని వివరించారు. పుత్తూరు అభివృద్ధితో పాటు చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుతో ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందరి సహకారం, సమన్వయంతో పనిచేసి నగరి గడ్డపై టీడీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రభుత్వ అరాచకాలతో ప్రజల్లో మార్పు

వడమాలపేట, ఏప్రిల్ 21: వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో ప్రజల్లో మార్పు ప్రారంభమైందని రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి దాము యాదవ్ చెప్పారు. మండలంలోని పాదిరేడు పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను ఇంటింటా అందజేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ధనంజయులు నాయుడు, హేమాద్రి నాయుడు, వెంకటయ్య, భాస్కర్‌నాయుడు, మణిరాజు, గణపతి, మాధవ నాయుడు, లక్ష్మీప్రసన్న, సతీష్, బాలకృష్ణ, చందు, రాధాకృష్ణ, హేమావతి, శుభచంద్ర, సురేష్, కేతన్, రాజా, చక్రవర్తి, లవకుమార్, శేషాద్రి, మునిశేఖర్, మదన్ పాల్గొన్నారు.


పాదిరేడులో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

టీడీపీలో చేరికలు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 21: మండలంలోని గోపాలకృష్ణాపురం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు ఈ.రామయ్య, వార్డు మెంబర్ ఈ.సురేష్, వైసీపీ నాయకులు టి.చిన్న, పి.కాంతారావు, టి.నైనప్ప, ఏ.అశోక్, ఏ.కనకయ్య, కే.మురగయ్య, కే.మణి, నాదముని, టి.రాంప్రసాద్ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య, మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఏ.బాలాజీ, పాండురంగయ్య, చిన్నా, గంగాకుమార్, గంగయ్య, మునిలక్ష్మమ్మ, కన్నయ్య, హరిగోపాల్ పాల్గొన్నారు.

